

# విభారే
## తెలుగు దినపత్రిక
## VIBHARE TELUGU DAILY







PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర్ రెడ్డి శనివారం 02 అక్టోబరు 2021 సంపుటి : 03 సంచిక : 54 పేజీలు : 4 వెల : రూ 3-00


# నేరడి వద్ద బ్యారేజీ నిర్మాణం కోసం చర్యలు తీసుకోండి: సీఎం జగన్



అమరావతి: రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ క్రమంలో అధికారులు పోలవరం ప్రాజెక్ట్ పనుల ప్రగతిని సీఎం జగన్‌కు వివరించారు. ప్రాజెక్ట్‌కు సంబంధించిన దిగువ కాపర్ డ్యాం పనులు, కెనాల్స్‌కు కనెక్టివిటీ అంశాలపై సమీక్షలో చర్చించారు. గ్యాప్ 3 కాంక్రీట్ డ్యామ్ పనులు పూర్తి చేశామని అధికారులు తెలిపారు. వచ్చే ఖరీఫ్ నాటికి కాల్వల ద్వారా నీరందించేందకు సిద్ధంగా ఉన్నామని అధికారులు తెలిపారు. ఈసీఆర్ఎఫ్ పనుల ప్రారంభానికి ప్రణాళిక సిద్ధం చేశామని అధికారలు సీఎం జగన్‌కు వివరించారు. ఆర్ అండ్ ఆర్ పనులపై కూడా సీఎం జగన్ సమీక్ష నిర్వహించారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి 2,033 కోట్ల రూపాయలకు పైగా నిధులు రావాల్సి ఉందని అధికారులు సీఎం జగన్‌కి తెలిపారు. ఈ క్రమంలో కేంద్ర నిధులు త్వరగా వచ్చేలా చూడాలని సీఎం జగన్ అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని ఇతర ప్రాజెక్ట్‌ల ప్రగతిపై కూడా సీఎం జగన్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నెల్లూరు బ్యారేజీ పనులు పూర్తి చేశామని.. నవంబర్‌లో ప్రారంభోత్సవానికి సిద్ధమని అధికారులు వెల్లడించారు. అవుకు టన్నెల్ నిర్మాణంలో గణనీయ ప్రగతి సాధించామని.. వచ్చే ఆగస్టు నాటికి టన్నెల్ పూర్తి చేసి నీటిని ఇస్తామని అధికారులు తెలిపారు.వెలిగొండ ప్రాజెక్ట్ పనులపై సీఎం జగన్ సమీక్ష నిర్వహించారు. రెండో టన్నెల్ పనులు వేగవంతం చేయాలని సీఎం జగన్ అధికారులను ఆదేశించారు. వంశధార స్టేజ్-2 పనులు వచ్చే మే నాటికి పూర్తి చేస్తామని తెలిపారు అధికారులు. నేరడి వద్ద బ్యారేజీ నిర్మాణం కోసం చర్యలు తీసుకోవాల్సిందిగా సీఎం జగన్ అధికారులను ఆదేశించారు. ఒడిశా రాష్ట్రంతో చర్చల కోసం చర్యలు తీసుకోవాలని సీఎం జగన్ సూచించారు. తోటపల్లి బ్యారేజీ కింద వచ్చే ఖరీఫ్ నాటికి నీటిని అందిస్తామని అధికారులు తెలిపారు. మహేంద్రతనయ ప్రాజెక్ట్ నిర్మాణంపై దృష్టి పెట్టాల్సిందిగా సీఎం జగన్ ఆదేశించారు. కొల్లేరు వద్ద గోదావరి, కృష్ణా డెల్టాల్లో రెగ్యులేటర్ నిర్మాణ పనులు చేపట్టాలని సూచించారు. తాండవ ప్రాజెక్ట్ విస్తరణ, కృష్ణా నదిపై బ్యారేజీల నిర్మాణంపై దృష్టి పెట్టాలని కోరారు. తాండవ ప్రాజెక్ట్ నిర్మాణం కోసం ఇప్పటికే టెండర్లు పిలిచామని అధికారులు సీఎం జగన్‌కి తెలిపారు. తొలివిడత టెండర్ల ప్రక్రియలో అధికంగా కోట్ చేసిన పనులపై మరోసారి రివర్స్ టెండరింగ్‌కు వెళ్లామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమానికి జలవనరులశాఖ మంత్రి అనిల్ కుమార్ యాదవ్, నూతన సీఎస్ సమీర్ శర్మ, ఇరిగేషన్ సెక్రెటరీ శ్యామలరావు, ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# వ్యర్థాలు నూటికి నూరు శాతం ప్రాసెసింగ్ జరగాలి : మోదీ



న్యూఢిల్లీ : మన దేశంలో రోజువారీ వ్యర్థాల్లో 70 శాతం వరకు ప్రాసెసింగ్ జరుగుతోందని, దీనిని నూటికి నూరు శాతానికి పెంచవలసిన అవసరం ఉందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. నగరాల్లోని చెత్త కొండలను ప్రాసెస్ చేసి, పూర్తిగా తొలగిస్తామని చెప్పారు. స్వచ్ఛ భారత్ మిషన్-అర్బన్ 2.0, అటల్ మిషన్ ఫర్ రిజువనేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్‌ఫర్మేషన్ (అమృత్) 2.0లను శుక్రవారం ఆయన ప్రారంభించారు.దేశంలోని అన్ని నగరాలకు చెత్త నుంచి విముక్తి కల్పించడం, నీటి భద్రత కల్పించడం లక్ష్యాలుగా స్వచ్ఛ భారత్ మిషన్-అర్బన్ 2.0, అటల్ మిషన్ ఫర్ రిజువనేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్‌ఫర్మేషన్ (అమృత్) 2.0లను రూపొందించారు. ఈ కార్యక్రమాలను ప్రధాని మోదీ శుక్రవారం న్యూఢిల్లీలోని డాక్టర్ అంబేద్కర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, స్వచ్ఛ భారత్ మిషన్ 2.0 లక్ష్యం నగరాలను చెత్త రహితం చేయడమేనని చెప్పారు. ఈ రెండో దశలో మురుగు నీటి పారుదల, భద్రతా నిర్వహణలను సాధించాలనుకుంటున్నట్లు తెలిపారు. నగరాల్లో నీటి భద్రత కల్పించడం, మురికి నల్లాలు నదుల్లో కలవకుండా చర్యలు తీసుకోవడం ఈ పథకాల లక్ష్యాలని తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కలలు సాకారం కావడానికి ఇది చాలా ముఖ్యమైన ముందడుగు అని తెలిపారు. నేటి కార్యక్రమాన్ని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సెంటర్లో నిర్వహించడం చాలా గొప్ప విషయమని, సమానత్వం కోసం పట్టణాలు అభివృద్ధి చెందడం చాలా ముఖ్యమని ఆయన నమ్మేవారని చెప్పారు. మన దేశంలో రోజుకు సుమారు 1 లక్ష టన్నుల వ్యర్థాల ప్రాసెసింగ్ జరుగుతోందన్నారు. ఈ పథకాల ప్రారంభ సమయంలో ఇది 20 శాతమేనని చెప్పారు. నేడు రోజువారీ వ్యర్థాల్లో సుమారు 70 శాతం వరకు ప్రాసెసింగ్ జరుగుతోందన్నారు. దీనిని నూటికి నూరు శాతానికి పెంచడం అవసరమని తెలిపారు. స్వచ్ఛతా పథకాల రెండో దశలో నగరాల్లోని చెత్త కొండలను ప్రాసెస్ చేసి, పూర్తిగా తొలగిస్తామన్నారు. అలాంటి ఓ చెత్త కొండ ఢిల్లీలో చాలా కాలం నుంచి ఉందని, తొలగింపు కోసం ఎదురు చూస్తోందని అన్నారు.

# నగరానికి ఊపిరి ఆడనివ్వడం లేదు : రైతు సంఘంతో సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ : దేశ రాజధాని నగరం ఢిల్లీకి ఊపిరి ఆడనివ్వడం లేదని రైతు సంఘాలను ఉద్దేశించి సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. కొత్త సాగు చట్టాలపై నిరసన తెలిపేందుకు హైవేలను దిగ్బంధనం చేయడంపై మండిపడింది. జంతర్ మంతర్ వద్ద సత్యాగ్రహం నిర్వహించేందుకు కిసాన్ మహా పంచాయత్ అనుమతి కోరడంతో అత్యున్నత న్యాయస్థానం శుక్రవారం ఈ వ్యాఖ్యలు చేసింది. జంతర్ మంతర్ వద్ద కనీసం 200 మంది రైతులు/నిరసనకారులు సత్యాగ్రహం నిర్వహించేందుకు అనుమతి ఇవ్వాలని, అందుకు తగిన స్థలాన్ని కేటాయించే విధంగా అధికారులను ఆదేశించాలని కిసాన్ మహా పంచాయత్ సుప్రీంకోర్టును కోరింది. ఈ సత్యాగ్రహాన్ని శాంతియుతంగా, అహింసాయుతంగా నిర్వహిస్తామని తెలిపింది. ఈ పిటిషన్‌పై జస్టిస్ ఏఎం ఖన్విల్కర్, జస్టిస్ సీటీ రవి కుమార్ ధర్మాసనం విచారణ జరిపింది. "మీరు మొత్తం నగరాన్ని ఊపిరి ఆడకుండా చేశారు. ఇప్పుడు మీరు నగరంలోకి రావాలనుకుంటున్నారు. నగరవాసులు ఈ నిరసనతో సంతోషంగా ఉన్నారా? ఇటువంటి పనిని ఆపాలి" అని ధర్మాసనం పేర్కొంది. మూడు సాగు చట్టాలకు వ్యతిరేకంగా ఒకసారి కోర్టును ఆశ్రయించిన తర్వాత న్యాయ వ్యవస్థపై నమ్మకం ఉండాలని తెలిపింది. వివాదాన్ని పరిష్కరించనివ్వాలని పేర్కొంది. "మీకు కోర్టుల మీద నమ్మకం ఉంటే, నిరసనలు తెలపడానికి బదులుగా అత్యవసర విచారణ జరపాలని కోరండి. మీరు న్యాయ వ్యవస్థకు వ్యతిరేకంగా కూడా నిరసన తెలుపుతున్నారా?" అని ప్రశ్నించింది. రైతులు హైవేలను దిగ్బంధనం చేస్తూ, నిరసన శాంతియుతమని చెప్తున్నారని పేర్కొంది. ప్రజలకు కూడా సంచరించే హక్కులు ఉన్నాయని తెలిపింది. వారి ఆస్తులను ధ్వంసం చేస్తున్నారని పేర్కొంది. "మీరు భద్రతపై కూడా ప్రభావం చూపిస్తున్నారు. మీరు డిఫెన్స్ సిబ్బందిని కూడా ఆపారు" అని పేర్కొంది.దీనిపై రైతు సంఘం తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ, తాము హైవేలను దిగ్బంధనం చేయలేదని, పోలీసులు తమను అక్కడ నిర్బంధించారని చెప్పారు.

# సీఎం జగన్‌ను కలిసిన సీఎస్ సమీర్ శర్మ, ఆదిత్యనాథ్ దాస్



అమరావతి: ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సమీర్ శర్మ శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ఈ భేటీ జరిగింది. ఈ భేటీలో ప్రభుత్వ సలహాదారుగా నియమితులైన ఆదిత్యనాథ్ దాస్ కూడా పాల్గొన్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ సమీర్ శర్మ గురువారం బాధ్యతలు స్వీకరించగా, ఆదిత్యనాథ్ దాస్ ఈ రోజు ప్రభుత్వ ప్రధాన సలహాదారుగా బాధ్యతలు స్వీకరించనున్నారు.

# శనివారం వైఎస్సార్ జిల్లాకు సీఎం వైఎస్ జగన్

అమరావతిసీఎం వైఎస్ జగన్ రెండు రోజుల పర్యటన నిమిత్తం వైఎస్సార్ జిల్లా పులివెందులకు వెళ్లనున్నారు. అక్టోబర్ 2వ తేదీ మధ్యాహ్నం తాడేపల్లి నుంచి బయలుదేరి సాయంత్రం 4 గంటలకు కడప ఎయిర్పోర్టుకు చేరుకుంటారు. సాయంత్రం 4.20 గంటలకు ఇడుపులపాయలోని హెలిప్యాడ్ వద్ద స్థానిక నాయకులతో కొద్దిసేపు మాట్లాడతారు. అనంతరం వైఎస్సార్ ఎస్టేట్కు చేరుకొని రాత్రికి అక్కడే బస చేస్తారు. 3వ తేదీ తన మామ డాక్టర్ ఈసీ గంగిరెడ్డి ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని ఉదయం 10గంటలకు పులివెందులలోని లయోలా డిగ్రీ కాలేజీ రోడ్డులో ఉన్న సమాధి వద్దకు చేరుకొని నివాళులు అర్పిస్తారు. 10.30కి భాకరాపురంలోని ఆడిటోరియంలో జరిగే ప్రార్థనల్లో పాల్గొంటారు. ఆ తర్వాత 11.40 గంటలకు భాకరాపురంలోని నివాసానికి వెళ్తారు.

# ఏపీలో కొత్తగా 809 కరోనా కేసులు




అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో కరోనా కేసులు క్రమంగా తగ్గుముఖం పడుతున్నాయి. గడిచిన 24 గంటల్లో ఏపీలో 56,463 మందికి కరోనా పరీక్షలు నిర్వహించగా 809 మందికి కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. 24 గంటల్లో కరోనా బారిన పడి 10 మంది మృత్యువాతపడ్డారు. దీంతో మొత్తం మరణాల సంఖ్య 14186 కు చేరింది. ఒకరోజులో 1,160 మంది కోవిడ్ నుంచి కోలుకుని క్షేమంగా డిశ్చార్జ్ అవ్వగా, ఇప్పటివరకు 19,89,391 మంది ఏపీలో డిశ్చార్జ్ అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ శుక్రవారం కరోనాపై హెల్త్ బులెటిన్ విడుదల చేసింది. ప్రస్తుతం 11,142 కరోనా కేసులు యాక్టివ్‌గా ఉన్నాయి. దీంతో రాష్ట్రంలో పాజిటివ్ కేసుల సంఖ్య 20,51,133 కు చేరింది. ఏపీలో ఇప్పటివరకు 2,83,50,167 కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఇప్పటివరకు రాష్ట్రంలో 20,25,805 మంది కరోనా నుంచి కోలుకున్నారు.

# పవన్ కల్యాణ్ రాష్ట్రానికే ఓ గుదిబండగా తయారయ్యారు: మంత్రి సురేష్



అమరావతి: జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌పై వైసీపీ మంత్రి ఆదిమూలపు సురేష్ విమర్శలు గుప్పించారు. పవన్ రాష్ట్రానికే ఓ గుదిబండగా తయారయ్యారని ఆదిమూలపు సురేష్ మండిపడ్డారు. ఎన్నో పుస్తకాలు చదివానని చెప్పుకునే పవన్.. కులాల మధ్య చిచ్చుపెట్టడం తగదని, పవన్ ఎప్పుడో ఒకసారి బయటకొచ్చి కులాల్ని రెచ్చగొట్టి వెళ్లిపోతారని సురేష్ విమర్శించారు. రాజకీయంగా ఎదగాలంటే ఇది సరైన పద్ధతి కాదని పవన్ తెలుసుకోవాలని మంత్రి సూచించారు. ఎన్నికలు వస్తే ఏదో ఒక అలజడి సృష్టించాలన్నదే పవన్ ధోరణి అని ఆదిమూలపు సురేష్ అన్నారు. టీడీపీ భావజాలంతోనే పవన్ కల్యాణ్ వెళ్తున్నారని మంత్రి ఆదిమూలపు సురేష్ తెలిపారు.

# ఏపీ ఐసెట్ ఫలితాలు విడుదల, టాప్ 10 ర్యాంకులు వీరికే



విజయవాడ: ఆంధ్రప్రదేశ్‌లో మంత్రి ఆదిమూలపు సురేష్ శుక్రవారం విడుదలచేసిన ఏపీ ఐసెట్ ఫలితాల్లో శ్రీకాకుళం జిల్లాకు చెందిన మాలపల్లి రామకృష్ణ మొదటి ర్యాంకు సాధించాడు. 154 మార్కులతో టాప్‌లో నిలిచాడు. తరువాత అనంతపురం జిల్లా వ్యక్తి బండి లోకేష్ 153 మార్కులతో రెండో ర్యాంకు సాధించాడు. నిలిచాడు. తేనేల వెంకటేష్(విజయనగరం)- మూడో ర్యాంకు, అల్లి లిఖిత్(చిత్తూరు)-నాలుగో ర్యాంకు, షైక్ సమీయుల్లా(చిత్తూరు)-ఐదో ర్యాంకు సాధించారు.

# జనసేనాని వద్దకు సినీ నిర్మాతల బృందం

అమరావతి: ఈ మధ్యే ఏపీ మంత్రి పేర్ని నానిని కలిసిన టాలీవుడ్ సినీ నిర్మాతలు తాజాగా పవన్ కళ్యాణ్‌తో సమావేశమయ్యారు. పవర్ స్టార్ ఘాటు వ్యాఖ్యలతో గత కొద్ది రోజులుగా ఆంధ్రప్రదేశ్ అధికార పక్షానికి, పవన్‌కి మధ్య వివాదం కొనసాగుతోంది. ప్రభుత్వమే సినిమా టికెట్లను అమ్మాలని భావించటంపై జనసేనాని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. దాంతో అదే స్థాయిలో వైసీపీ నేతలు కూడా స్పందించారు. రచయిత, నటుడు పోసాని కృష్ణమురళి మాటలు కూడా మధ్యలో మరింత వేడిని రాజేశాయి. అయితే, ఇప్పుడు టాలీవుడ్ నిర్మాతలు దిల్ రాజు, డీవీవీ దానయ్య, నవీన్ ఎర్నేని, సునీల్ నారంగ్, బన్నీ వాసు, వంశీరెడ్డి తదితరులు పవన్‌ను కలవటం అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది.పవన్‌తో నిర్మాతల మంతనాలు ఏయే అంశాలపై సాగాయన్నది ఇంకా తెలియటం లేదు. కాకపోతే, సినిమాటోగ్రఫీ మంత్రి పేర్ని నానిని కలిసిన సందర్భంగా మాత్రం వారు చిత్ర పరిశ్రమని వివాదాల్లోకి లాగొద్దని విజ్ఞప్తి చేశారు. సినిమా టికెట్లను ఆన్‌లైన్‌లో విక్రయించాలని తామే కోరినట్టుగా నిర్మాతలు తెలిపారు.

# పవన్ చీప్ పబ్లిసిటీ మానుకోవాలి: సజ్జల



అమరావతి: బద్వేల్ ఉప ఎన్నికలో జనసేన ఎవరితో కలిసినా మాకు నష్టం లేదు.. అసలు ఎన్నకల్లో పోటీ చేయడానికి పవన్‌కు ఉన్న ఫ్యాక్టర్ ఎంత అని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణా రెడ్డి ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "పవన్ కల్యాణ్ చేసే శ్రమదానంపై స్పందించాల్సిన అవసరం లేదు. పవన్ పబ్లిసిటీ పోరాటాలు చెయ్యడం మానుకోవాలి. కెమెరా అన్ చేసి యాక్షన్ అనగానే చెయ్యడానికి ఇది సినిమా కాదు. గోతులు పూడ్చి ఫోటోలు దిగి చేసే ఆందోళనల వల్ల ప్రయోజనం లేదు" అన్నారు సజ్జల. "రోడ్ల మరమ్మతుల కోసం ప్రభుత్వం 2,200 కోట్ల రూపాయలతో నిర్మాణాలు చేస్తున్నాం. చీప్ పబ్లిసిటి కోసం ఇలాంటి పనులు చెయ్యడం పవన్ కల్యాణ్ మానుకోవాలి. పవన్ స్థాయికి మేము దిగజారాల్సిన అవసరం లేదు. జనసేన దిశ లేకుండా ప్రయాణం చేస్తుంది. బద్వేల్ ఉప ఎన్నికలో జనసేన ఎవరితో కలిసిన నష్టం ఏమి లేదు. ఎన్నికల్లో పోటీ చేయడానికి పవన్‌కు ఉన్న ఫ్యాక్టర్ ఎంత" అని సజ్జల ప్రశ్నించారు.

# ఏపీలో రోడ్లన్నీ నరకకూపాల్లా మారాయి: సోమిరెడ్డి



అమరావతి: ఏపీలో రోడ్లన్నీ నరకకూపాల్లా మారాయని, ఆర్ అండ్ బీ శాఖ మూతపడిందని టీడీపీ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి దుయ్యబట్టారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వాహనదారులు ప్రాణాలు పోగొట్టుకుంటున్నా ప్రభుత్వంలో చలనంలేదని తప్పుబట్టారు. ఎవరు డబ్బులిస్తే వారికే కాంట్రాక్టులు, చెల్లిస్తున్నారని ఆరోపించారు. ఆర్థికశాఖ అధికారి సత్యనారాయణ 15శాతం చెల్లింపులు చేస్తేనే బిల్లులు చెల్లిస్తున్నారని, ఏ ఫైల్ క్లియర్ చేయాలన్నా 90 రోజుల సమయం తీసుకుంటున్నారని తెలిపారు. ప్యాచ్ వర్క్‌కు జనసేన ముందుకొస్తే ప్రభుత్వానికి ఇబ్బందేంటి? అని సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ప్రశ్నించారు.

# సంపాదకీయం

శనివారం 02 అక్టోబరు 2021

## న్యాయవ్యవస్థకు జవసత్వాలు వచ్చేనా

న్యాయ వ్యవస్థను ఆధునీకరించటం, సమర్థులైన వ్యక్తులు న్యాయమూర్తులుగా వెళ్లేందుకు ఇష్టపడేలా ఆ వ్యవస్థని రూపుదిద్దటం అవసరం. పని గంటలు పెంచటం కాకుండా ఉన్న సమయంలో సరిగ్గా పని చేసేట్లు ఉన్నత న్యాయస్థానాలు పర్యవేక్షించటం,అనవసరమైన సెలవుల్ని తగ్గించటం, మధ్యవర్తిత్వంలో న్యాయమూర్తుల ప్రత్యక్ష పర్యవేక్షణ ఉండటం లాంటి చర్యలకు పూనుకోవటం ద్వారా ఈ పెండెన్సీని గణనీయంగా తగ్గించవచ్చు.స్వతంత్ర భారత దేశ చరిత్రలో ఏనాడూ న్యాయమూర్తుల ఖాళీలన్నీ నింపిన పాపాన పోలేదు. ప్రస్తుతం దేశ వ్యాపితంగా 5984 మంది న్యాయమూర్తుల ఖాళీలు ఉన్నాయి. ఇందులో అధిక భాగం అంటే 78 శాతం బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్ లాంటి పది రాష్ట్రాలలోనే ఉన్నాయి. మొత్తం ఉండాల్సిన 22,677 మంది న్యాయమూర్తుల్లో ఈ సంఖ్య నాలుగో వంతు పైనే అవుతుంది. మొత్తం దేశంలో పెండింగ్‌లో ఉన్న 4 కోట్ల కేసుల్లో 2.72 కోట్ల కేసులు దిగువ కోర్టుల్లోనే కాగా మిగిలినవి దేశం లోని 25 హైకోర్టుల్లోనూ, సుప్రీం కోర్టులోనూ ఉన్నాయి. ఈ పెండింగ్ కేసులు 10 సంవత్సరాలపై నుండి ఉన్నవి 22,57,000 కాగా అందులో కొన్ని రెండు మూడు దశాబ్దాలుగా ఉన్నాయఅనేక సంవత్సరాల తర్వాత ప్రస్తుతం సుప్రీం కోర్టుకు పూర్తి స్థాయి (ఒకటి తక్కువ)లో న్యాయమూర్తులున్నారు. పార్లమెంటరీ కమిటి సిఫారసు ప్రకారం ప్రతి పది లక్షల జనాభాకు 50 మంది న్యాయమూర్తులు వుండాలి. అయితే దేశంలో 13 మంది మాత్రమే ఉన్నారు. ఈ 13 మందిలోనే పైన చెప్పిన ఖాళీలు ఉన్నాయి.దేశం లోని హైకోర్టుల్లో 1098 న్యాయమూర్తులుండాల్సి ఉండగా అందులో 465 ఖాళీలున్నాయి. 37 మంది ఉండాల్సిన ఆంధ్రప్రదేశ్‌లో 19 మంది మాత్రమే ఉన్నారు. 42 మంది న్యాయమూర్తులుండాల్సిన తెలంగాణ హైకోర్టులో 21 మంది, 160 మంది న్యాయమూర్తులు ఉండాల్సిన అలహాబాద్ హైకోర్టులో 68 మంది, 94 మంది ఉండాల్సిన బొంబాయి హైకోర్టులో 33 పోస్టులు, 60 మంది ఉండాల్సిన ఢిల్లీ హైకోర్టులో 31 పోస్టులు, 55 మంది ఉండాల్సిన పంజాబ్ హర్యానా హైకోర్టులో 40 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దేశవ్యాపితంగా ఉన్న అన్ని హైకోర్టుల్లోనూ ఇదే పరిస్థితి. మరోవైపు పెండెన్సీ తగ్గటానికి మధ్యవర్తిత్వం పరమౌషధంగా చాలా మంది న్యాయమూర్తులు ఇటీవల ప్రవచించటమే గాక లోక్ అదాలత్‌లలో ఇబ్బడిముబ్బడిగా కేసులు పరిష్కరిస్తున్నారు. అయితే ఇక్కడ కక్షిదారులకు ముఖ్యంగా నష్టపరిహారం కోసం ఎదురు చూసే న్యాయార్థులకు తీరని అన్యాయం జరుగుతుంది. సంవత్సరాల తరబడి జరుగుతున్న జాప్యం కారణంగా ఇన్సూరెన్స్ కంపెనీలు ఇష్టానుసారంగా విదిల్చే తక్కువ పరిహారానికి అంగీకరించాల్సిన నిస్సహాయ పరిస్థితి వారికి కలుగుతుంది. క్రిమినల్ కేసుల్లో మధ్యవర్తిత్వ పరిష్కారం కారణంగా చాలా కేసులు పరిష్కరించాలని చెప్పుకోవటానికి కోర్టులు పోలీసులపైన ఒత్తిడి చేస్తుంటే, పోలీసులు బాధితులపై ఒత్తిడి చేసి 'మమ' అనిపిస్తున్నారు. దేశంలో ఎక్కువ చోట్ల ఈ పరిష్కారాల్లో న్యాయమూర్తుల పర్యవేక్షణ ఉండటం లేదు. న్యాయాన్యాయ విచక్షణ లేకుండా ఇరువురూ కోర్టు బయట చేసుకొనే రాజీలను రికార్డ్ చేసే పనికి న్యాయమూర్తులు పరిమితమవుతున్నారు. అసలే 4 కోట్ల పైచిలుకు కేసుల జాప్యంతో కునారిల్లుతున్న మన న్యాయపాలిక కోవిడ్ కారణంగా మరో 25 శాతం కేసులు పెరగటంతో సతమతమవుతుందిస్వతంత్ర న్యాయ వ్యవస్థ" అని గప్పాలు కొట్టుకొనే మనం అది నిజమని గుండెలపై చేయి వేసుకొని చెప్పలేం. కింది కోర్టుల్లో న్యాయమూర్తుల నియామకం విషయంలో కేంద్ర ప్రభుత్వం పాత్రఉండదు. రాష్ట్ర ప్రభుత్వం తోనూ, రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ తోనూ చర్చించి హైకోర్టులే చేయవచ్చు. కాని మౌలిక వసతులు కల్పించాల్సిన ప్రభుత్వాలు ఉన్న కోర్టులకు, న్యాయ మూర్తులకే సరైన వసతులు కల్పించటం లేదు. ఖాళీలు నింపే విషయమై సుప్రీంకోర్టు దేశంలోని అన్ని హైకోర్టుల్ని ఆదేశించినా ప్రభుత్వాల అలసత్వం కారణంగా ఇది ముందుకు కదలటం లేదు. కొన్ని కోర్టులు సంఖ్య చెప్పుకోవటానికి ఉన్నా... న్యాయమూర్తుల కొరత కారణంగా ఇన్‌ఛార్జి జడ్జీలు ఈ కోర్టుల పని పూర్తిగా చేయలేకపోతున్నారు. పైగా పని భారంతో తమ స్వంత కోర్టు పని కూడా చేయలేకపోతున్నారు. పెండెన్సీకి మరో కారణం ఇబ్బడిముబ్బడిగా ఉన్న సెలవలు. అమెరికా లాంటి దేశాల్లో కోర్టులకు వేసవి సెలవులే ఉండవు. కాని మన దేశంలో అన్ని కోర్టులకూ నెల రోజుల పైనే సెలవులుంటాయి. సంక్రాంతికి, దసరాకి పది రోజుల చొప్పున, శని, ఆదివారాలు కారణంగా సంవత్సరానికి 100 రోజులు, న్యాయమూర్తులకు 20 పబ్లిక్ సెలవులు, 11 ఆప్షనల్ సెలవులు ఉంటాయి. న్యాయవాదులు కోర్టులు బహిష్కరిం చటం, కొన్ని చోట్ల న్యాయవాదులు చనిపోతే ఆ రోజు మొత్తం విధులకు హాజరు కాకపోవటం, మొత్తంపైన సగానికి పైగా పనిదినాలు వృధా అవుతుండగా, పర్యవేక్షణ కొరవడిన న్యాయమూర్తుల పని విధానం కూడా ఈ పెండెన్సీ పెరుగుదలకు కారణమే. గడచిన రెండున్నరేళ్ళుగా ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా వేసిన కేసుల్ని విచారించటానికే హైకోర్టుకు సమయం సరిపోయింది. ఇక పెండెన్సీ పెరగక ఏం చేస్తుంది? ఇప్పటికీ వేల సంఖ్యలోనే ప్రభుత్వంపైన వేసిన కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇందులో షుమారు 8 వేలు కోర్టు ధిక్కరణ కేసులే ఉండటం గమనార్హం.కేసుల్లో జరుగుతున్న జాప్యానికి శాశ్వత పరిష్కారం చూడాలి. షార్ట్‌కట్ ఉపాయాలు సమస్యని పరిష్కరించకపోగా మరింత జటిలం చేస్తాయి. దేశ వ్యాపితంగా న్యాయమూర్తుల ఖాళీలను నింపటం, కోర్టులకు కావాల్సిన మౌలిక వసతులు కల్పించటం, కోర్టుల్ని ఆధునీకరించటం, సమర్థులైన వ్యక్తులు న్యాయమూర్తులుగా వెళ్ళటానికి ఇష్టపడేలా ఆ వ్యవస్థని రూపుదిద్దటం అవసరం.

# 10 లక్షల ఎకరాలు ఖాళీ

ఏలూరు, అక్టోబరు 1, (న్యూస్ పల్స్)ర్షాభావం, అదను తప్పిన వానలు, కరోనా, ఆనక గిట్టుబాటుధరల్లేమి ఈ మారు ఖరీఫ్‌ను కుంగదీశాయి. సాధారణ విస్తీర్ణంలో నాలుగు లక్షల హెక్టార్లు (పది లక్షల ఎకరాలు) సేద్యానికి నోచుకోలేదు. సీజన్ నార్మల్‌లో 11 శాతం సాగు తగ్గింది. నవ్యాంధ్ర ఏర్పడ్డాక ఇంతటి స్థాయిలో సాగుకు యోగ్యమైన పొలాలు బీడు పడడం ఇప్పుడేనని నిపుణులు విశ్లేషిస్తున్నారు. దాదాపు అన్ని పంటల సాగు తగ్గింది. ఆహారధాన్యాలు 1.68 లక్షల హెక్టార్లు (4 లక్షల ఎకరాలు) తగ్గాయి. నార్మల్‌లో 8 శాతం లోటు. జూన్-సెప్టెంబర్ ఖరీఫ్ కాలం కాగా గురువారంతో సీజన్ ముగుస్తున్న వేళ సాగు లెక్కలను వ్యవసాయశాఖ వెల్లడించింది. అన్ని పంటలూ కలుపుకొని నార్మల్ సాగు 37.33 లక్షల హెక్టార్లు కాగా 33.32 లక్షల హెక్టార్లలో సేద్యం జరిగింది. ప్రభుత్వం ఈ ఏడాది నార్మల్‌కు మించి 38.14 లక్షల హెక్టార్లలో సాగును ఆశించగా కనీసం సీజన్ నార్మల్ మేరకన్నా సాగు కాలేదు. ఆహార పంటల్లో ప్రధానమైన వరి 53 వేల హెక్టార్లు (3 శాతం) తగ్గింది. భూగర్భ జలాలతోపాటు ప్రధాన రిజర్వాయర్లలో, చెరువుల్లో, కుంటల్లో సమృద్ధిగా నీరు అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో సైతం వరి తగ్గింది. అక్టోబర్ రెండవ వారం వరకు నీటి వసతులున్న చోట్ల వరి వేస్తారని చెబుతున్నప్పటికీ మహా అయితే ఇంకో 20 వేల హెక్టార్లలోపేనని అంచనా వేస్తున్నారు. చిరుధాన్యాలలో మొక్కజన్న మినహా అన్ని పంటలూ తగ్గాయి. మొత్తంగా చిరుధాన్యాలు 24 వేల హెక్టార్లు (13 శాతం) తగ్గాయి. ఈ తడవ పప్పుధాన్యాలు 84 వేల హెక్టార్లు (25 శాతం) తగ్గాయి. కందులు, పెసలు, మినుములు, అలసందలు అన్నీ తగ్గాయి. నూనెగింజలు 84 వేల హెక్టార్లు (11 శాతం) తగ్గాయి. వేరుశనగ 75 వేల హెక్టార్లు (10 శాతం) తగ్గింది. ఆముదాలు, నువ్వులు సైతం తగ్గుదలే.ఈ మారు వాణిజ్య పంటల సాగు కూడా తగ్గింది. పత్తి 96 వేల హెక్టార్లు (16 శాతం) తగ్గింది. జూట్, పసుపు, ఉల్లి, చెరకు సైతం తగ్గాయి. ఒక్క మిరప మాత్రమే నూటికి నూరు శాతం సాగైంది.

జిల్లాల వారీగా చూసినా ఈ ఏడాది నూటికి నూరు శాతం నార్మల్ సాగును చేరింది లేదు. కడపలో అత్యధికంగా 95 శాతం విస్తీర్ణంలో సాగు నమోదైంది. గుంటూరులో కనిష్టంగా 78 శాతం సేద్యం జరిగింది. ఉత్తరాంధ్రలో వర్షాభావం వలన సాగు సాగలేదు. కండలేరు జలాశయంలో నీరు ఉన్నా నెల్లూరులో నిరుటి కంటే 45 వేల హెక్టార్లలో వరి తగ్గింది. మరో వైపు ఆ జిల్లా ఇప్పటికీ వర్షాభావంలోనే మగ్గుతోంది. ఈ సారి రాయలసీమలో వర్షాలు బానే కురిశాయి. సాగు ఒక మేరకు సాగింది. నిన్న మొన్నటి గులాబ్ తుపాన్ వలన ఉత్తరాంధ్ర, ఉభయగోదావరి, కృష్ణ జిల్లాల్లో సుమారు రెండు లక్షల ఎకరాల్లో పంటలు నీట మునిగాయని సర్కారు తెలిపింది. ఎన్యూమరేషన్ పూర్తయితే నష్టం పెరిగే అవకాశం ఉంది

# శ్రీ ప్రాజెక్టుకు భారీ స్పందన

ఒంగోలు, అక్టోబరు 1, (న్యూస్ పల్స్)ప్రకాశం జిల్లా చీరాల వాడరేవు సముద్ర తీర జలాల్లో వలలతో కూడిన పంజరాల్లో చేపల పెంపకానికి (కేజ్ కల్చర్) రంగం సిద్ధమైంది. సముద్రంలో ఆక్సిజన్ సమృద్ధిగా ఉన్న ప్రదేశంలో 18 అడుగుల పొడవు, వెడల్పు, 12 అడుగుల లోతులో వలలతో పంజరాలను ఏర్పాటు చేసి చేపల సాగు చేస్తున్నారు. కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో కేజ్ కల్చర్ మంచి ఫలితాలు ఇస్తోంది. దీంతో, చీరాల వాడరేవు సముద్ర ప్రాంతం కూడా ఇందుకు అనువైనదిగా గుర్తించారు. ఇతర రాష్ట్రాల్లో విడివిడిగా పంజరాలను నిర్వహిస్తున్నారు. దీనివల్ల నిర్వహణ భారం పెరుగుతుందని గుర్తించిన వాడరేవు మత్స్యకారులు ఒకేచోట పది కేజ్‌లు పెట్టే ఆలోచన చేశారు. వాడరేవులో బోట్ల తయారీలో సిద్ధహస్తుడైన రాకత్ శివ నేతృత్వంలో ఈ ప్రాజెక్టు చేపట్టారు. శివ మేనల్లుళ్లు ఉస్మాన్, సతీష్ విశాఖలోని ఆంధ్రా విశ్వవిద్యాలయంలో పిజి పూర్తి చేశారు. అక్కడ మెరైన్ కల్చర్ (సముద్రంలో చేపల సాగు) గురించి తెలుసుకున్నారు. తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో ఇప్పటికే కొందరు విజయవంతంగా కేజ్ కల్చర్ నిర్వహిస్తుండడంతో విశాఖలోని మెరైన్ ఫిషరీ రీసెర్చ్ సంస్థ (సిఎంఎఫ్ఆర్ఐ)కు వెళ్లి వివరాలు సేకరించారు. శివ అనుభవం ఉస్మాన్, సతీష్‌ల సాంకేతిక నైపుణ్యంతో సముద్ర పంజరాల్లో భారీగా చేపల పెంపకానికి ప్రణాళికలు రూపొందించారు. మత్స్యశాఖ అధికారుల దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లగా వారు సానుకూలంగా స్పందించి సిఎంఎఫ్ఆర్ఐ శాస్త్రవేత్త శేఖర్ మేఘరాజన్‌ను వాడరేవు రప్పించి అలల తీవ్రత, అనుకూలతపై సర్వే చేయించి భారీ కేజ్ నిర్మాణానికి అనుమతి ఇచ్చారు. మొత్తం ప్రాజెక్టులో 40 శాతం సబ్సిడీతో కూడిన రుణం మంజూరు చేశారు. 145 అడుగుల పొడవు, 45 అడుగుల వెడల్పు, 15 అడుగుల ఎత్తుతో పది కేజ్‌లు (పంజరాలు) కలిసి ఉండేలా పెద్ద నౌక తరహా భారీ పంజరం నిర్మాణానికి రూపకల్పన చేశారు. దీర్ఘకాలం పాటు సముద్ర జలాల్లో నిలిపి ఉంచడం వల్ల ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఫైబర్ ఉడ్, తుప్పు పట్టని అల్యూమినియం పైపులతో దీన్ని నిర్మించారు. పది కేజ్‌ల మధ్య నిలువు, అడ్డంగా దారులు, వెనుక భాగంలో మత్స్యకారుల తాత్కాలిక నివాసానికి ప్రత్యేకంగా గది నిర్మాణం చేశారు. నిరంతర పర్యవేక్షణకు నిఘా కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. దేశంలోనే ఇది మొదటి భారీ కేజ్ కల్చర్ ప్రాజెక్టుగా చెబుతున్నారు.వాడరేవు సముద్ర తీరంలో గతేడాది కాలంగా ఈ భారీ ప్రాజెక్టు నిర్మాణం జరుగుతోంది. కరోనా కల్లోలం వల్ల నిర్మాణ పనుల్లో జాప్యం జరిగింది. పనులు ఇప్పుడు దాదాపు పూర్తయ్యాయి. భారీ ఓడలా ఉండే ఈ నిర్మాణాన్ని వాడరేవు సముద్ర తీరం నుంచి లోపల రెండు కిలోమీటర్లలో నిలిపి ఉంచి దిగువ భాగంలో ఉండే వలల పంజరాల్లో చేపల పెంపకం చేపడతారు. సముద్రంలో చేపల సేద్యం ప్రారంభించిన ఆరు నెలల కాలంలో వంద టన్నుల మేర చేపల ఉత్పత్తి వస్తుందని భావిస్తున్నారు. ఈ భారీ ప్రాజెక్టులో భాగంగా విదేశాలకు ఎగుమతి చేసే పలు రకాల చేపలను పెంచేందుకు అవసరమైన చేప పిల్లల నర్సరీని కూడా సిద్ధం చేస్తున్నారు.

# సైకిల్ తో సవారీ....




కాకినాడ, అక్టోబరు 1, (న్యూస్ పల్స్)జనసేన అధినేత పవన్ కల్యాణ్ క్లారిటీతో ఉన్నారు. జనసేన సర్వసభ్య సమావేశంలో ఆయన చేసిన వ్యాఖ్యలు రాష్ట్రంలో జరగబోయే పరిణామాలకు సంకేతాలుగా చెప్పాలి. అవసరమైతే తాను వ్యూహం మార్చుకుంటానని పవన్ కల్యాణ్ చెప్పడం ఇప్పుడు ఏపీ రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారింది. జనసేన అధినేత ఆలోచనలు సైకిల్ పార్టీ వైపు చూస్తున్నట్లుగానే ఉంది. ఇప్పటికే జనసేన, టీడీపీ పొత్తుపై ప్రచారం జరుగుతోంది.పవన్ కల్యాణ్ ప్రస్తుతం బీజేపీతో పొత్తుతో కొనసాగుతున్నారు. అయితే రాష్ట్ర రాజకీయ పరిస్థితుల దృష్ట్యా బీజేపీ, జనసేన కలసి పోటీ చేస్తే అధికారంలోకి రావడం అన్నది జరిగే పని కాదు. జగన్ పార్టీని ఎదుర్కొనాలంటే వ్యూహం మార్చాల్సిందేనని ఆయన గట్టిగా అభిప్రాయపడుతున్నారు. అది టీడీపీతో పొత్తుతోనే సాధ్యమని పవన్ కల్యాణ్ గట్టిగా విశ్వసిస్తున్నట్లు కన్పిస్తుంది. తాను టీడీపీతో పొత్తు పెట్టుకుంటే ఖచ్చితంగా విజయం ఖాయమన్న ధీమాలో ఉన్నారు.అందుకే విస్తృత స్థాయి సమావేశంలో పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా కమ్మ సామాజికవర్గం గురించి ప్రస్తావించినట్లు విశ్లేషణలు వినపడుతున్నాయి. వైసీపీ నేతలు కమ్మవారిపై కక్ష కట్టారని, కాశ్మీర్ పండిట్లను తరివేసినట్లు ఒక జాతిని రాష్ట్రానికి దూరం చేయాలనుకుంటున్నారన్నారు. వారికి అండగా నిలబడతామని పవన్ కల్యాణ్ భరోసా ఇచ్చారు. అయితే ఇక్కడ పవన్ కల్యాణ్ కు ఒక చిక్కుంది అంటున్నారు.కాపు సామాజికవర్గం సహజంగా టీడీపీతో పొత్తు పెట్టుకోవడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తుంది. ముద్రగడ పద్మనాభం పై వ్యవహరించిన తీరు, టీడీపీ ప్రభుత్వం పెట్టిన కేసులను వారు ఇప్పటికీ గుర్తు చేస్తున్నారు. పవన్ కల్యాణ్ బీజేపీతో పొత్తుతో దిగితే కాపు సామాజికవర్గం ఆయనకు అండగా నిలబడొచ్చు కాని, టీడీపీతో పొత్తు పెట్టుకుంటే కలసి రాకపోవచ్చు అన్న విశ్లేషణలు వినపడుతున్నాయి. మొత్తం మీద పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు వింటే టీడీపీతో పొత్తు ఖాయంగానే కన్పిస్తుంది.

పట్టించుకోని కమలం...

జనసేన అధినేత పవన్ కల్యాణ్ పై వైసీపీ నేతలు విరుచుకుపడుతున్నారు. వ్యక్తిగత విమర్శలకు కూడా దిగుతున్నారు. మంత్రులు నుంచి సినీ నటుల వరకూ పవన్ కల్యాణ్ ను టార్గెట్ చేస్తున్నారు. పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలకు కౌంటర్ గానే వీటిని చేస్తున్నప్పటికీ భాగస్వామి పార్టీ నుంచి ఎటువంటి మద్దతు పవన్ కల్యాణ? కు లభించలేదు. అసలు బీజేపీ ఈవిషయంలో జోక్యం చేసుకోకూడదన్న భావనతో ఉందా? అన్న ప్రశ్న తలెత్తుతోంది.పవన్ కల్యాణ్ సినిమా టిక్కెట్ల ధరలను ప్రభుత్వం తన చేతుల్లోకి తీసుకోవడాన్ని తప్పుపడు తున్నారు. ఆన్ లైన్ విధానంతో నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు నష్టపోతారని ఆయన చెబుతున్నారు. అయితే దీనిపై భాగస్వామ్య పార్టీగా ఉన్న బీజేపీ ఏమాత్రం స్పందించలేదు. సినిమా టిక్కెట్ల విషయంలో బీజేపీ వైఖరి ఏంటో ఇంతవరకూ చెప్పలేదు. బీజేపీ నేతలందరూ ఈ విషయంలో మౌనంగానే ఉండటంతో ప్రభుత్వానికే మద్దతు అని చెప్పకనే చెబుతున్నారనిపిస్తోంది.ఇక తాజాగా పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలకు పెద్దయెత్తున వైసీపీ నేతలు కౌంటర్ ఇస్తున్నారు. వ్యక్తిగతంగా సోషల్ మీడియాలో దూషణలకు దిగుతున్నారు. రాజకీయంగా ఇరువైపుల చేసుకునే వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. అయితే బీజేపీ ఈ విషయంలోనూ మౌనంగానే ఉంది. రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు మినహా ఎవరూ పవన్ కల్యాణ్ కు మద్దతుగా ఈ అంశంపై మాట్లాడలేదు.ఆంధ్రప్రదేశ్ లో జనసేన, బీజేపీ పొత్తు ఉంది. అయితే కొంత కాలంగా రెండు పార్టీలూ ఎవరి దారి వారేనని చెబుతున్నాయి. పరిషత్ ఎన్నికల్లో టీడీపీ, జనసేన పొత్తు పెట్టుకున్నాయి. జనసేన సయితం సొంతంగా ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాలను చేపట్టింది. ఈనేపథ్యంలో రెండు పార్టీలకు మధ్య గ్యాప్ బాగా పెరిగిందన్న టాక్ రాజకీయ వర్గాల్లో విన్పిస్తుంది. ఒక వేళ బద్వేలులో కలసి పోటీ చేసినా అది పైకి మాత్రమేని, లోపల మాత్రం ఒకరిపై ఒకరు పలు అంశాల్లో .

# బద్వేలు లెక్కలు ఏంటీ

కడప, అక్టోబరు 1, (న్యూస్ పల్స్)బద్వేల్ ప్రీమియర్ లీగ్‌లో సత్తా చాటెదెవరు? వరుస విజయాలతో ఊపుమీదున్న వైసీపీ బద్వేల్‌లోనూ గెలుపు మాదేనంటోంది. ప్రతిపక్ష టీడీపీ మాత్రం ఈసారి సత్తా చాటుతామని ఉవ్విళ్లూరుతోంది. కమలం కూడా ఇంచుమించు అదే ధీమాతో ఉంది. ఇంతకీ అక్కడ గెలుపెవరిది? ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఆసక్తికరంగా మారింది బద్వేల్ అసెంబ్లీ ఎన్నికల పోరు.కడప జిల్లా బద్వేల్ నియోజకవర్గంలో ఉప ఎన్నికల సందడి మొదలైంది. అక్టోబర్ 30న పోలింగ్..నవంబర్ 2న కౌంటింగ్? డేట్ ఇప్పటికే ఫిక్సయింది. దీంతో పొలిటికల్ ఫైట్ రీసౌండ్ కూడా మొదలైంది. వైసీపీ నుంచి వెంకట సుబ్బయ్య భార్య డా.సుధ పోటీ చేస్తున్నారు. టీడీపీ నుంచి ఓబుళాపురం రాజశేఖర్ బరిలో నిలవడం ఖాయంగా కనిపిస్తోంది. బీజేపీ మాత్రం జనసేనతో చర్చించి అభ్యర్థిని ఫైనల్ చేసే పనిలో పడింది.బద్వేల్ నియోజకవర్గానికి ఇప్పటిదాకా 15 సార్లు ఎన్నికలు జరిగాయి. కాంగ్రెస్- 6, టీడీపీ-4 , వైసీపీ- 2 సార్లు విజయం సాధించాయి. 2019 ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి డాక్టర్ వెంకట సుబ్బయ్య 61 శాతం ఓట్లు సాధించారు. ఈసారి ఈక్వేషన్స్ ఎలా ఉంటాయన్నది ఇంట్రెస్టింగ్‌గా మారింది. పంచాయతీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపాలిటీ, కార్పొరేషన్ ఎన్నికల్లో విజయంతో ఉత్సాహం మీదున్న వైసీపీ.. బద్వేల్‌లోనూ అలవోకగా విజయం సాధిస్తామన్న కాన్ఫిడెంట్‌తో ఉంది.వైసీపీ అభ్యర్థి దాసరి సుధాతో పాటు కడపజిల్లాకు చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పలువురు ముఖ్య నాయకులకు అదిస్ఠానం నుంచి పిలుపొచ్చింది. ఉప ఎన్నిక బాధ్యతలు, ప్రచారం, పోల్ మేనేజ్మెంట్ పై జిల్లా నేతలకు సీఎం జగన్ దిశానిర్దేశం చేశారు. సిట్యువేషన్ చూస్తుంటే బద్వేల్‌లో గెలుపును అధికార పార్టీ సీరియస్‌గానే తీసుకున్నట్టు కనిపిస్తోంది.ప్రతిపక్ష టీడీపీ మాత్రం ఎలాగైనా గెలిచి నిలవాలని కంకణం కట్టుకుంది. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని భావిస్తోంది. ఇక బీజేపీ-జనసేన కాంబినేషన్ కూడా విజయంపై భారీ ఆశలే పెట్టుకుంది. అయితే ఎంతమేర ప్రభావం చూపిస్తాయన్నది చూడాలి.బద్వేల్ నియోజకవర్గంలో మొత్తం 7 మండలాలున్నాయి. ఓటర్ల సంఖ్య 2 లక్షల 4 వేల 614 మంది

# కమలంతోనే సుజనా



విజయవాడ, అక్టోబరు 1, (న్యూస్ పల్స్)కష్టాలన్నీ ఒకేసారి ముంచుకు వస్తాయి. పారిశ్రామిక వేత్త, రాజ్యసభ సభ్యుడు సుజనా చౌదరికి కాలం కలసి రావడం లేదు. ముందున్నవన్నీ కష్టాలేనని చెప్పాలి. ఇటు సీబీఐ, ఈడీ కేసులు, అటు రాజ్యసభ పదవీకాలం ముగియనుండటంతో ఇక రాజకీయంగా, వ్యాపారపరంగా ఇబ్బందులు తప్పేట్లు లేవు. దీనికి తోడు బీజేపీలోనూ ఆయన పట్టు కోల్పోతున్నారు. సోము వీర్రాజు వర్గం ఆయనను, ఆయన అనుచరులను దూరం పెట్టేసింది.సుజనా చౌదరి పదవీ కాలం మరికొద్ది నెలల్లోనే ముగియనుంది. ఇక బీజేపీ మరోసారి ఆయనను రాజ్యసభకు పంపుతుందా? అంటే అనుమానమే. ఎందుకంటే బీజేపీ ఇటీవల రాజ్యసభ పదవులను భర్తీ చేసిన విధానం చూస్తుంటే సుజనా చౌదరికి రావడం కష్టమే. కర్ణాటక తదితర రాష్ట్రాల్లో పార్టీలో సుదీర్ఘకాలం నుంచి పనిచేస్తున్న వారికే రాజ్యసభ పదవులు ఇచ్చారు. సుజనా చౌదరి నిన్నగాక మొన్న వచ్చారు. ఆయనకు మరోసారి రాజ్యసభ పదవిని రెన్యువల్ చేయడం కష?టం.మరోవైపు రాజ్యసభ పదవి పోతే ఢిల్లీ స్థాయిలో లాబీయింగ్ చేయడం కూడా కష్టమవుతుంది. తాను పారిశ్రామికవేత్తగా అనేక కేసులు ఎదుర్కొంటున్నారు. తొలుత సుజనా చౌదరి ఈ కేసుల నుంచి బయటపడాల్సి ఉంది. కోర్టు అనుమతితో ఆయన విదేశాలకు వెళ్లాల్సిన పరిస్థి?తి ఏర్పడింది. ఇటువంటి పరిస్థితుల్లో ఆయన బీజేపీలోనే కొనసాగే అవకాశాలున్నాయి. బీజేపీలో ఉంటేనే కొంత కేసుల నుంచి రక్షణ దొరుకుతుంది.సుజనా చౌదరి బీజేపీ, టీడీపీ మధ్య సయోధ్య కుదర్చడానికి చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఇక్కడ సోము వీర్రాజు పార్టీ అధ్యక్షుడిగా వచ్చిన తర్వాత అది అసాధ్యమని తేలిపోయింది. జేపీ నడ్డా వంటి వారు సుముఖత వ్యక్తం చేసినా రాష్ట్ర నేతలు టీడీపీతో సయోధ్యకు అంగీకరించడం లేదు. దీంతో సుజనా చౌదరి ఆ డీల్ ను వదిలేశారని, 2024 ఎన్నికల ఫలితాలు వచ్చే వరకూ బీజేపీలోనే ఉంటారు. అప్పుడు ఫలితాలను బట్టి నిర్ణయం తీసుకోనున్నారు.

# వలస నేతలకు చెక్...

గుంటూరు, అక్టోబరు 1, (న్యూస్ పల్స్)తెలుగుదేశం పార్టీలో ఇతర పార్టీల నుంచి వచ్చిన నేతల ఆధిపత్యం పెరిగిపోతుంది. పార్టీని నమ్ముకున్న వారికి కాకుండా పార్టీ హైకమాండ్ ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి ప్రాధాన్యత ఇవ్వడాన్ని తొలి నుంచి ఉన్న నేతలే కాదు క్యాడర్ కూడా సహించలేకపోతుంది. ఇది నిజంగా విచిత్రమైన పరిస్థి?తి. అసలే అంతంత మాత్రంగా ఉన్న టీడీపీని బలోపేతం చేయాలని చంద్రబాబు ప్రయత్నిస్తుంటే వలస నేతలను పక్కన పెట్టాలన్న డిమాండ్ రోజురోజుకూ పెరుగుతుండటం ఆందోళన కల్గిస్తుంది.సీనియర్ నేత గోరంట్ల బుచ్చయ్య చౌదరి వంటి నేతలు ఎప్పటి నుంచో చెబుతున్నారు. పార్టీ వలస నేతలకు పెద్దపీట వేస్తే కింది స్థాయి నుంచి అసంతృప్తి రగులుతుందని ఆయన అంటూనే ఉన్నారు. గత ప్రభుత్వంలో నలుగురు వైసీపీ ఎమ్మెల్యేలకు మంత్రి పదవి ఇచ్చినప్పుడే అసంతృప్తి మొదలయింది. బొజ్జల గోపాలకృష్ణారెడ్డి వంటి సీనియర్ నేతలు అసహనం కూడా వ్యక్తం చేశారు. అయితే అధికారంలో ఉండటంతో చంద్రబాబు నేతలకు సర్దిచెప్పుకోగలిగారు.ఇప్పుడు కొన్ని జిల్లాల్లో వలస నేతలకు టీడీపీ క్యాడర్ నుంచే ఇబ్బందులు ఎదురవుతున్నాయి. చంద్రబాబు సొంత జిల్లాలో చిత్తూరులో పెత్తనం అంతా ఇతర పార్టీల నుంచి వచ్చి అమర్ నాథ్ రెడ్డి, నల్లారి కిషోర్ కుమార్ రెడ్డికి అప్పగించడాన్ని అభ్యంతరం తెలుపుతున్నారు. అధికారంలో ఉన్నప్పుడు అమర్ నాథ్ రెడ్డికి మంత్రిపదవి, నల్లారికి నామినేట్ పదవి ఇచ్చినప్పటికీ వారు పార్టీని పట్టించుకోవడం లేదంటున్నారు.ఇక అనంతపురం జిల్లాలోనూ జేసీ బ్రదర్స్ ను దూరం పెట్టాలన్న డిమాండ్ పెరుగుతుంది. కాంగ్రెస్ నుంచి వచ్చిన జేసీ సోదరులకు పెత్తనం ఇస్తే ఊరుకోబోమని హైకమాండ్ కు హెచ్చరికలు కూడా వస్తున్నాయి. తొలి నుంచి టీడీపీలో ఉన్న నేతలంతా జేసీ బ్రదర్స్ కు వ్యతిరేకంగా ఏకమయ్యారు. చంద్రబాబు కూడా వీరి డిమాండ్ కు తలొగ్గక తప్పడంలేదు. చాలా రోజుల తర్వాత వలస నేతలపై పార్టీ లో తొలి నుంచి ఉంటున్న నేతలు అసహనం వ్యక్తం చేస్తుండటం టీడీపీ అధినేతకు తలనొప్పిగా మారింది.

# గుడివాడ, గన్నవరం సంగతేంటీ

విజయవాడ, అక్టోబరు 1, (న్యూస్ పల్స్)కృష్ణా జిల్లా గుడివాడ, గన్నవరం నియోజకవర్గాలు పేరు చెబితే చాలు?తెలుగుదేశం పార్టీకి కంచుకోటలు అని అర్థమైపోతుంది. అయితే కంచుకోటలు ఒక్కప్పుడు మాత్రమే. ఇప్పుడు ఆ రెండుచోట్ల టీడీపీ పరిస్థితి దారుణంగా ఉంది. ఇలా టీడీపీ పరిస్థితి దెబ్బతినడానికి పరోక్షంగా చంద్రబాబే కారణమని కొందరు టీడీపీ నాయకులు భావిస్తున్నారు. ఎందుకంటే 2004 ముందు వరకు గుడివాడలో టీడీపీని దివంగత రావి శోభనాద్రి ఫ్యామిలీ చూసుకునేది. శోభనాద్రి, ఆయన తనయులు హర గోపాల్, వెంకటేశ్వరరావులు పార్టీ కోసం పనిచేస్తూ వచ్చారు. వీరు ముగ్గురు ఎమ్మెల్యేలుగా గెలిచి అరుదైన రికార్డు సొంతం చేసుకున్నారు.కానీ 2004 ఎన్నికల్లో రావి ఫ్యామిలీని కాదని చంద్రబాబు, కొడాలి నానికి సీటు ఇచ్చారు. ఇక 2004, 2009 ఎన్నికల్లో టీడీపీ తరుపున గెలిచి, బాగా ఫాలోయింగ్ పెంచుకున్న నాని, ఆ తర్వాత వైసీపీలోకి జంప్ చేశారు. 2014, 2019 ఎన్నికల్లో వరుసగా వైసీపీ తరపున నాని గెలుస్తూ వస్తున్నారు. ఇప్పుడు మంత్రిగా ఉంటూ, చంద్రబాబుపై ఎలాంటి విమర్శలు చేస్తున్నారో తెలిసిందే. అయితే నాని టీడీపీని వీడాక, గుడివాడలో ఆ పార్టీ పరిస్తితి మరీ ఘోరంగా తయారైంది. నాని టీడీపీలో ఎదిగి, టీడీపీ క్యాడర్‌ని చాలా వరకు తనవైపు తిప్పేసుకున్నారు. దీంతో మళ్ళీ చంద్రబాబు, రావి వెంకటేశ్వరరావుని తీసుకొచ్చి గుడివాడలో పెట్టారు. అయినా సరే ఇక్కడ టీడీపీ పైకి లేచేలా కనిపించడం లేదు.అటు గన్నవరంలో కూడా అదే పరిస్థితి..అప్పటివరకు టీడీపీకి అండగా ఉన్న దాసరి బాలవర్ధనరావుని చంద్రబాబు సైడ్ చేసి, 2014లో వల్లభనేని వంశీకి సీటు ఇచ్చారు. ఇక వంశీ 2014, 2019 ఎన్నికల్లో టీడీపీ తరపున గెలిచారు. అధికారంలో ఉన్న ఐదేళ్లు పార్టీలో బాగానే పనిచేసిన వంశీ, అధికారం కోల్పోయాక టీడీపీని వీడి వైసీపీలోకి జంప్ చేశారు. దీంతో ఇప్పుడు గన్నవరంలో టీడీపీ పరిస్తితి ఘోరంగా తయారైంది. బచ్చుల అర్జునుడు ఇంచార్జ్‌గా ఉన్నా సరే పార్టీ బలోపేతం కావడం లేదు.టీడీపీలో మంచిగా ఫాలోయింగ్ తెచ్చుకున్న వంశీ..వైసీపీలోకి వెళ్ళడంతో గన్నవరంలో టీడీపీ పరిస్థితి అదోగతి పాలైంది. ఇలా గుడివాడ, గన్నవరంలో పరోక్షంగా చంద్రబాబే టీడీపీని దెబ్బతినడానికి కారణమని టీడీపీ సీనియర్లు భావిస్తున్నారు.

## మంగళగిరి లో మైనస్ అవుతోందా...

గుంటూరు, అక్టోబరు 1, (న్యూస్ పల్స్)మంగళగిరి నియోజకవర్గం రాష్ట్ర రాజకీయాల్లో ఎప్పుడూ ఆసక్తికరంగానే ఉంటుంది. గత ఎన్నికల్లో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పోటీ చేయడంతో రాష్ట్ర వ్యాప్తంగా మంగళగిరి అందరి నోళ్లలోనూ నానింది. ఫలితాలు వచ్చిన తర్వాత అక్కడ లోకేష్ ఓటమి పాలు కావడంతో మంగళగరి 2019 ఎన్నికల్లోనే హైలెట్ గా నిలిచింది. ఇప్పుడు మరోసారి మంగళగిరి నియోజకవర్గం వార్తల్లో నిలిచింది.మంగళగిరి నియోజకవర్గం నుంచి వరసగా ఆళ్ల రామకృష్ణారెడ్డి రెండుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 2014లో టీడీపీ వేవ్ లోనూ ఆళ్ల రామకృష్ణారెడ్డి గెలుపొందారు. ఇక చంద్రబాబు అమరావతిని రాజధానిగా ప్రకటించిన తర్వాత మంగళగిరిలో టీడీపీ మరింత పుంజుకుంటుందని భావించారు. కానీ మంగళగిరి ప్రజలు మాత్రం రాజధాని కాకుండా ప్రభుత్వాన్ని మార్చడం కోసం మరోసారి ఆళ్ల రామకృష్ణారెడ్డిని ఎన్నుకున్నారు.గత ఎన్నికల సమయంలోనే ఆళ్ల రామకృష్ణారెడ్డి తాను మంగళగిరి నుంచి పోటీ చేయనని చెప్పారు. ఆర్థిక ఇబ్బందులతో పాటు తనకు అనుకూల నియోజకవర్గం కాదని ఆయన భావించారు. కానీ జగన్ పట్టుబట్టి మరీ ఆళ్లను మంగళగిరి నుంచి పోటీ చేయించారు. ఎన్నికల ప్రచారంలో తాను మంత్రిని చేస్తానని కూడా జగన్ ప్రకటించారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత రాజధాని మార్పు ప్రకటన ఇక్కడ ఆళ్లకు క్రమంగా పట్టుసడలుతుందని చెబుతున్నారు.తెలుగుదేశం పార్టీ పరిషత్ ఎన్నికలను బహిష్?కరించినా మంగళగిరి నియోజకవర్గంలోని దుగ్గిరాల మండలంలో టీడీపీ అత్యధిక స్థానాలను గెలుచుకుంది. 14 స్థానాలకు ఎన్నికలు జరిగితే అందులో 9 స్థానాల్లో విజయం సాధించింది. క్రమంగా టీడీపీ మంగళగిరిలో పట్టు పెంచుకుంటోందన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. పంచాయతీ ఎన్నికల్లో తమదే విజయం అని చెప్పుకుంటున్న వైసీపీకి పరిషత్ ఎన్నికల ఫలితాలు మాత్రం రాజకీయంగా ఇరుకున పెట్టాయి.

## ఆరసవల్లికి భక్తుల పోటు

**స్వామిని తాకిన సూర్యకిరణాలు**

శ్రీకాకుళంఅక్టోబరు 1, (న్యూస్ పల్స్) శ్రీకాకుళం జిల్లా అరసవల్లి సూర్యనారాయణ స్వామిని భానుడి కిరణాలు తాకాయి. ఉదయం ఆరు నిమిషాల పాటు సూర్య కిరణాలు మూలవిరాట్ను స్పృశించిన అద్భుత దృశ్యాలను చూసి భక్తులు పులకించారు. అరసవల్లి సూర్యనారాయణ స్వామిని సూర్య కిరణాలు తాకిన దృశ్యాన్ని భక్తులు తిలకించారు.ప్రతి ఏటా మార్చి 9, 10 తేదీల్లో స్వామి వారిని సూర్య కిరణాలు తాకడం ఇక్కడ ఆనవాయి తీ. మళ్లీ అక్టోబర్ 1,2 తేదీల్లోనూ ఈ అపురూప దృశ్యం సాక్షాత్కారం అవు తుంది. ఉత్తరాయణం, దక్షిణాయనం మార్పుల్లో చోటుచేసుకునే ఈ అద్భు తాన్ని చూసేందుకు పెద్దసంఖ్యలో భక్తులు తరలి వెళ్తుంటారు.

## అలిపిరి టోల్ గేట్ లో థర్మో స్కానర్లు

తిరుపతిఅక్టోబరు 1, (న్యూస్ పల్స్) తిరుమల శ్రీవారి దర్శనాల నేపథ్యంలో టిటిడి పటిష్ట చర్యలు చేపట్టింది. అలిపిరి టోల్గేట్ సమీపంలో థర్మో స్కానర్లు ఏర్పాటు చేసింది. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తుల ఆరోగ్య పరిస్థితులను సమీక్షించడానికి తగిన చర్యలు చేపడుతోంది. పరిమిత సంఖ్యలో భక్తులను దర్శనానికి అను మతించనున్నారు.అయితే తిరుపతి అలిపిరి తనిఖీ కేంద్రంలో లగేజీ స్కానర్స్ వల్ల 7,8,9,10 పాయింట్ల వద్ద పూర్తిగా నిలిచిపోయాయి. బస్సులు ప్రవేశించే లేన్స్ లో పూర్తిగా నిలిచిపో యిన తనిఖీలు దీంతో స్కానింగ్ నిర్వహించకుండా అనుమతిచ్చేస్తున్న విజిలెన్స్ సిబ్బంది.కనీసం లగేజీ బ్యాగ్ లను తెరిచి కూడా చూడని వైనంపై ఆందోళన వ్యక్తం అవుతుంది.

## హంద్రీనీవాకు విద్యుత్ కష్టాలు..

**హంద్రీనీవా ప్రాజెక్టు విద్యుత్ బకాయి రూ,317కోట్లు..**

**ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం బకాయి రూ,57 కోట్లు..**

**ప్రాజెక్టులకు విద్యుత్ ను నిలిపివేస్తామంటున్న అధికారులు..**

**రెండు రోజుల గడువు కోరిన నీటిపారుదల శాఖ..**

నందికొట్కూరు. అక్టోబర్ 01. కర్నూలు జిల్లా నందికొట్కూరు నియోజకవర్గంలోని సాగునీటి ప్రాజెక్టులు హంద్రీనీవా సుజల స్రవంతి పథకం, ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం,అలాగే నందికొట్కూరు సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ , మున్సిపాలిటీ కార్యాలయం విద్యుత్ బిల్లుల బకాయిలు పేరుకుపోయాయి. ఎత్తిపోతల పథకాల బకాయి బిల్లులు కోట్లలో ఉండడంతో జిల్లా వ్యాప్తంగా జలమండలి శాఖల కార్యాలయాలలో గురువారం విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. హంద్రీనీవా సుజల స్రవంతి ఎత్తిపోతల పథకానికి విద్యుత్ సరఫరాను నిలిపి వేయాలని నందికొట్కూరు విద్యుత్ శాఖ అధికారులు ఏడి శ్రీనివాసులు ప్రయత్నించారు. విషయం తెలుసుకున్న జల మండలి అధికారులు విద్యుత్ శాఖ అధికారులతో చర్చించారు.బకాయిలు చెల్లించేందుకు రెండు రోజుల గడువు కావాలని కోరినట్లు విద్యుత్ శాఖ ఏఈ మధన్ మోహన్ తెలిపారు.ఏఈ మధన్ మోహన్ మాట్లాడుతూ విద్యుత్ బిల్లుల బకాయి 2019,2020, 2021సంవత్సరాలలో ఇప్పటి వరకు హంద్రీ నీవా ఎత్తిపోతల పథకం విద్యుత్ బకాయిలు రూ,317 కోట్లు, ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం విద్యుత్ బిల్లుల బకాయి రూ,57 కోట్లు ఉన్నాయన్నారు.అలాగే నందికొట్కూరు సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ విద్యుత్ బిల్లుల బకాయి రూ,4కోట్లు, నందికొట్కూరు మున్సిపాలిటీ విద్యుత్ బిల్లుల బకాయి రూ, 10లక్షలు ఉన్నట్లు తెలిపారు. నందికొట్కూరు, పగిడ్యాల, మిడుతూరు మండలంలోని గ్రామ పంచాయతీలలో దాదాపు రూ,30కోట్ల బకాయిలు పేరుకుపోయాయని తెలిపారు. బకాయిలు చెల్లించాలని ఆయా శాఖల అధికారులకు సమాచారం ఇచ్చిన ఇప్పటివరకు చెల్లించక పోవడంతో ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు పలు ప్రభుత్వ కార్యాలయాలకు విద్యుత్తు సరఫరా ను నిలిపి వేశారు.

## మైనర్ బాలికపై ఆత్యాచారయత్నం

అనంతపురం మైనర్ బాలికపై ఒక యువకుడు అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. యువకుడికి దేహశుద్ధి చేసిరి స్థానికులు అతడిని కొత్తచెరువు పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు బాధితురాలి తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసారు. అనంతపురం జిల్లా కొత్తచెరువు మండలం కేశాపురం గ్రామానికి చెందిన టోపీ సాహెబ్, అమ్మాజాన్ కుమార్తె స్థానికంగా ఉన్న పాఠశాలలో నాలుగో తరగతి చదువుతోంది. ఆ బాలిక జ్వరంతో బాధపడుతుండటంతో ఆమెను తల్లిదండ్రులు వైద్యం కోసం కొత్తచెరువు లోని షిరిడి సాయి క్లినిక్ తీసుకొచ్చారు. జ్వరంతో బాధపడుతున్న బాలికకు ఇంజక్షన్ వేయడానికి గదిలోకి తీసుకెళ్లిన హెల్త్ అసిస్టెంట్ జయరాం అత్యాచారయత్నానికి ప్రయత్నించాడు. ఆ చిన్నారి గట్టిగా కేకలు వేయడంతో వారి తల్లిదండ్రులతో పాటు అక్కడ ఉన్న స్థానికులు జయరామ్ కు దేహశుద్ధి చేసి సమీపంలో గల పోలీస్ స్టేషన్ లో అప్పగించారు. అనంతరం బాలిక తల్లిదండ్రులు తమకు జరిగిన అన్యాయాన్ని లిఖితపూర్వకంగా కొత్తచెరువు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫోక్సో చట్టం కింద జయరామ్ పై కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. బాలికను వైద్య పరీక్షల నిమిత్తం పెనుగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.బాలికపై అత్యాచారయత్నానికి ఒడిగట్టిన జయరామ్ ను కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

# సిట్టింగులకు సీట్లు కష్టమే

తిరుపతి, అక్టోబరు 1, (న్యూస్ పల్స్)విద్యార్థికి ప్రతీ ఏటా పరీక్ష ఉంటే రాజకీయ నేతకు అయిదేళ్ళకు ఒకసారి పరీక్ష ఉంటుంది. ఎమ్మెల్యే అయిన వారు పదే పదే తామే కొనసాగాలనుకుంటారు. అందుకోసం అధినేత ప్రాపకం కోసం తపన పడతారు. అయితే నాయకుడి చుట్టూ తిరిగితే టికెట్లు దక్కడం అన్నది పాత ట్రెండ్. టికెట్ కావాలి తామే మళ్లీ ఎమ్మెల్యే కావాలి అంటే ఉండాల్సిన చోట ఉండాలి మరి. అంటే తన నియోజకవర్గంలో జనాలకు చేరువగా ఉంటూ వారి మంచీ చెడ్డా చూసుకుంటే చూసుకున్న వారికే జనమూ వరమాల వేస్తారు. అధినాయకుడూ టికెట్ ఇస్తాడు. ఇపుడు వైసీపీ అయినా టీడీపీ అయినా ఇదే ట్రెండ్ అంటున్నారు.వచ్చే ఎన్నికల గురించి అపుడే మెల్లగా ఏపీలో రాజకీయ జ్వరం మొదలైంది. సగం పాలన పూర్తి కావడంతో అధికార వైసీపీ జాగ్రత్త పడుతూంటే ఈసారి తప్పులు అసలు చేయరాదు అనుకుంటోంది టీడీపీ. ఈ నేపథ్యంలో రెండు పార్టీలు కూడా సర్వేశ్వరులనే నమ్ముకున్నాయి. అధికార వైసీపీ ఎప్పటికపుడు సర్వేలు చేయిస్తోంది. ప్రభుత్వ పనితీరుతో పాటు ఎమ్మెల్యేల పనితీరు మీద నివేదికలు జగన్ చేతికి అందుతున్నాయి. వాటిని బట్టే ఆయన ముందుకు అడుగులు వేస్తున్నారు. మొత్తం 151 మంది ఎమ్మెల్యేలు ఉన్నా కూడా ఎవరు పనిమంతులు అన్న క్లారిటీ జగన్ కి పక్కాగా ఉందని చెబుతున్నారు. అందుకే జగన్ దేవుడు అంటూ మీడియా ముందు ఎమ్మెల్యేలు స్తోత్రపాఠాలు వల్లించినా కూడా ఆయన కరుణించేది ఉండదు అంటున్నారు.ఈసారి చాలా చోట్ల సిట్టింగుల సీట్లు మారిపోతాయని అంటున్నారు. జగన్ ఈ విషయంలో ఎవరి మాట వినే ప్రసక్తి లేదని చెబుతున్నారు. ఆయన పగడ్బందీగా సర్వేలు చేయిస్తున్నారు. ఒకటి కారు రెండు మూడు ఏజెన్సీల నుంచి కూడా నివేదికలు కోరుతున్నారు. వాటిలో మేలి ముత్యంగా బయటపడిన వారికే టికెట్లు దక్కుతాయని అంటున్నారు. అంటే జగన్ టికెట్ ఇవ్వాలి అంటే సర్వేలో ఫస్ట్ క్లాస్ లో పాస్ కావాల్సిందే అన్న మాట. ఈ విషయం తెలియడంతోనే చాలా మంది వైసీపీ ఎమ్మెల్యేల గుండెల్లో రైళ్ళు పరిగెడుతున్నాయట. జగన్నో, ఆ పక్క నున్న వారినీ ఆశ్రయించి టికెట్ పట్టేద్దామంటే ఈసారి అసలు కుదిరే వ్యవహారం కానే కాదని కూడా తేలిపోతున్న సత్యం.ఇక రాయలసీమ నుంచి మొదలుపెడితే ఉత్తరాంధ్రాలోని చిట్టచివరి జిల్లా శ్రీకాకుళం దాకా జగన్ సర్వేలనే నమ్ముకున్నారుట. ఎమ్మెల్యేగా ఎవరు తాము తోపు అనుకున్నా కూడా జగన్ దగ్గర పప్పులు ఉడికే ప్రసక్తే లేదని అంటున్నారు. ప్రస్తుతం జగన్ వద్ద ఉన్న నివేదికలు చూసుకుంటేనే యాభై నుంచి అరవై మంది దాకా సిట్టింగ్ ఎమ్మెల్యేలు అవుట్ అని తేలుతోంది. త్వరలో వారందరికీ పిలిచి జగన్ క్లాస్ తీసుకుంటారని అంటున్నారు. సార్వత్రిక ఎన్నికలకు ఇంకా సగం సమయం ఉన్నందువల్ల ఎవరైనా తమ పనితీరు మార్చుకుంటే ఓకే. లేకపోతే మాత్రం నిర్దాక్షిణ్యంగా తప్పించేసి మరీ కొత్తవారికి అక్కడ టికెట్ ఇస్తారుట. అందువల్ల వైసీపీ ఎమ్మెల్యేల ఫ్యూచర్ తాడేపల్లిలోని జగన్ దగ్గర లేదని, నేడు పనిచేయకుండా ఎన్నికల వేళ పొర్లు దండాలు పెట్టినా టికెట్ దక్కదు కాక దక్కదు అని అంటున్నారు.

## మండల అభివృద్ధి కొరకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి...

**ఎంపీపీ ఆదెమ్మ**

**హాజరైన మండల సర్పంచ్ లు,ఎంపీటీసీ లు**

తుగ్గలి అక్టోబరు 1, (న్యూస్ పల్స్) మండల అభివృద్ధి కొరకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని తుగ్గలి మండల మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు హనుమరాజు ఆదెమ్మ తెలియజేశారు. శుక్రవారం రోజున మండల కేంద్రమైన తుగ్గలి లోని స్థానిక ఎంపిడిఓ కార్యాలయం నందు అధికారులు మొదటి సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటు చేశారు.మొదటి సర్వసభ్య సమావేశంలో భాగంగా అధికారులు ముందుగా ఎంపీపీ,వైస్ ఎంపీపీ లను ఘనంగా సన్మానించారు.అనంతరం అధికారులు మాట్లాడుతూ సర్పంచ్ ల,ఎంపీటీసీ ల,జడ్పిటిసి మరియు ఎంపీపీ ల మరియు అధికారుల సమన్వయంతో మండలాన్ని అభివృద్ధి చేయాలని అధికారులు తెలియజేశారు. గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికను రూపొందించుకుని గ్రామాల అభివృద్ధికి అందరూ కృషి చేయాలని వారు తెలియజేశారు. అనంతరం ఎంపీపీ ఆదెమ్మ,వైస్ ఎంపీపీ మల్లికార్జున రెడ్డి మరియు జెడ్పిటిసి పులికొండ నాయక్ లు మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి మండల అభివృద్ధి బాధ్యతలు తమకు అప్పగించినందుకు ఎమ్మెల్యే శ్రీదేవి కు,తుగ్గలి మండలం వైసీపీ నాయకులకు,కార్యకర్తలకు మరియు ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఎమ్మెల్యే శ్రీదేవి సహాయ సహకారాలతో, అధికారుల సహకారాలతో,మండల వైసీపీ నాయకులు ప్రోత్సాహంతో గ్రామాల,గ్రామ పంచాయతీల మరియు మండల అభివృద్ధి కొరకు తన వంతు కృషి చేస్తామని వారిని సభాముఖంగా తెలియజేశారు.అనంతరం గ్రామ సర్పంచులు మరియు ఎంపీటీసీలు మండలంలో తిష్ట వేసిన సమస్యల గురించి మండల అధ్యక్షులకు వివరించగా,మండల అధ్యక్షులు వెంటనే గ్రామాలలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు తెలియజేశారు. అనంతరం ఉపాధి హామీ ఏపీవో రామకృష్ణ యాదవ్ మరియు తమ సిబ్బంది ఎంపీపీ కు పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలను తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వీర రాజు,సీనియర్ అసిస్టెంట్ జయ ప్రకాష్, జూనియర్ అసిస్టెంట్ రాంబ్రహ్మం,ఎంఈఓ రమా వెంకటేశ్వర్లు,హౌసింగ్ ఏఈ విజయ్ కుమార్, పిఆర్ఏఈ వెంకటేశ్వర్లు,ఏవో పవన్ కుమార్, అంగన్వాడి సూపర్వైజర్,పంచాయతీ కార్యదర్శులు,అన్ని శాఖల మండల స్థాయి అధికారులు,వైసిపి నాయకులు తుగ్గలి మోహన్ రెడ్డి,చంద్రశేఖర్ రెడ్డి,జగన్నాథ్ రెడ్డి,ఎర్రగుడి రామచంద్రా రెడ్డి,కో ఆప్షన్ నెంబర్ చాంద్ భాషా, రాతన ఉమ్మన్న,నాగభూషణ రెడ్డి,ఎంపీటీసీ ఎర్ర నాగప్ప,తుగ్గలి మండల సర్పంచ్ లు,ఎంపిటిసి లు తదితరులు పాల్గొన్నారు.ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై షామీర్ భాష పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు.

## ఘనంగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం

**నంద్యాల లో రాయలసీమ పరిరక్షణ సమితి**

నంద్యాల అక్టోబరు 1, (న్యూస్ పల్స్) తెలంగాణా అంధ్ర రాష్ట్రంతో కలిసి అంధ్రప్రదేశ్ ఏర్పడిన నవంబర్ 1 న నిర్వహిస్తున్న అంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని వెంటనే నిలుపు చేయాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అధికారంగా అంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని అక్టోబర్ 1 న ఘనంగా నిర్వహించాలని కోరారు. ఉమ్మడి మద్రాస్ రాష్ట్రం నుండి విడిపోయి ప్రత్యేక తెలుగు రాష్ట్ర ఏర్పాటుకు కీలకమైన రాయలసీమ హక్కుల పత్రం "శ్రీబాగ్" ఒడంబడికను అమలు పరచండి అన్నారు. రాయలసీమలో రాజధాని/ హైకోర్టు ఏర్పాటు చెయ్యాలి అని అన్నారు. కృష్ణ తుంగభద్ర నీటి కేటాయింపులో రాయలసీమకు ప్రథమ ప్రాధాన్యతతో కేటాయించండి అన్నారు. ఘనంగా ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు జరుపుకున్నట్లు రాయలసీమ సాగునీటి సాధన సమితి ఉపాధ్యక్షులు వైన్ .రెడ్డి తెలిపారు. శుక్రవారం నంద్యాలలోని రాయలసీమ సాగునీటి సాధన సమితి కార్యాలయం నుంచి సంజీవనగర్ జంక్షన్ వరకు ర్యాలిగా బయలుదేరి అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా వైయన్ .రెడ్డి ,ఏర్వ రామచంద్రారెడ్డి, వెంకటసుబ్బయ్యలు మాట్లాడుతూ.ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో ఉన్న తెలుగు ప్రాంతం వివక్షకు గురి అవుతున్న నేపథ్యంలో ఆంధ్ర రాష్ట్ర సాధనకు బీజం పడిందని అన్నారు. ఈ ఉద్యమంలో తొలి విజయం 1926 లో ఆంధ్రకు ప్రత్యేక విశ్వవిద్యాలయం స్థానంతో కలిగిందని, రాయలసీమలోని అనంతపురంలో ఏర్పాటు చేయవలసిన విశ్వవిద్యాలయంను విశాఖపట్నంలో ఏర్పాటు చేయడంతో రాయలసీమ వారు ప్రత్యేక తెలుగు రాష్ట్ర ఉద్యమానికి దూరమయ్యారని అన్నారు.రాయలసీమ జిల్లాల సహకారం లేనిదే ఆంధ్ర రాష్ట్ర సాధన జరిగదని భావించిన ఆంధ్ర మహాసభ పెద్దలు, నూతన తెలుగు రాష్ట్రంలో రాయలసీమ అభివృద్ధికి ప్రాధాన్యతను ఇస్తామని "శ్రీబాగ్ ఒడంబడికను" నవంబర్ 17, 1937 న చేయడం జరిగింది తెలిపారు. శ్రీబాగ్ ఒడంబడికలో కీలకమైన అంశాలు రాజధాని/ హైకోర్టు ను రాయలసీమ లో ఏర్పాటు చెయ్యడం, కృష్ణా తుంగభద్ర జలాలను రాయలసీమ సంపూర్ణ అవసరాల కోసం వినియోగించడం. ప్రత్యేక తెలుగు రాష్ట్రంలో శ్రీబాగ్ ఒడంబడిక అమలు జరిగి రాయలసీమ అభివృద్ధి చెందుతుందని భావించి, రాయలసీమ వాసులు ఆంధ్ర నాయకులతో కలసి అలుపెరగని పోరాటం చేసి ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రాన్ని అక్టోబర్ 1, 1953 న సాధించారన్నారు. కర్నూలు రాజధానిగా ఆంధ్ర రాష్ట్రం 3 సంవత్సరాలు కొనసాగింది. అనంతరం తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రంతో జత కలవడంతో 1956 లో ఆంధ్రప్రదేశ్ ఏర్పడటం, తెలంగాణ ఆంధ్ర రాష్ట్రం నుండి జూన్ 2, 2014 లో విడిపోవడంతో అక్టోబర్ 1 1953 లో సాధించుకున్న భూభాగంతో ఆంధ్రప్రదేశ్ నేడు కొనసాగుతున్నదని, అసలైన అంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినం అక్టోబర్ 1. అయితే గత ప్రభుత్వం తెలంగాణా అంధ్రప్రదేశ్ నుండి విడిపోయిన జూన్ 2 న అంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవంగా నిర్వహించిందని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం తెలంగాణా ఆంధ్ర రాష్ట్రంతో కలసిన నవంబర్ 1 న అంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవంగా నిర్విహిస్తున్నదని, ప్రభుత్వం శ్రీ బాగ్ ఒడంబడికను గౌరవిస్తున్నామని శాసనసభ సాక్షిగా ప్రకటించినా, ఆ దిశగా కార్యాచరణ చేపట్టలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవాన్ని అక్టోబర్ 1 న నిర్వహించక పోవడం, తద్వారా రాష్ట్ర అవతరణకు కీలకమైన శ్రీ బాగ్ ఒడంబడికను ప్రజల స్మృతి పథం నుండి తుడిచి వేసే చర్యగా రాయలసీమ వాసులు భావిస్తున్నారని,ఈ నేపథ్యంలో రాయలసీమ సాగునీటి సాధన సమితి దత్తమండలాలకు రాయలసీమ నామకరణం జరిగిన నంద్యాలలో అక్టోబర్ 1, 2021 న ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవాన్ని నిర్వహించామని అన్నారు. ఈ సందర్భంగా అక్టోబర్ 1 ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవంగా ప్రభుత్వం ప్రకటించాలని వారు డిమాండ్ చేసారు.. తెలుగు రాష్ట్ర సాధనకు కీలకమైన శ్రీబాగ్ ఒడంబడిక అమలుకు ప్రభుత్వం కార్యాచరణ చేపట్టాలని, అన్ని రాజకీయ పార్టీలు అక్టోబర్ 1 న ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవంగా ప్రభుత్వం ప్రకటించేలాగా, రాయలసీమ ప్రాంతం అభివృద్ధి చెందటానికి నిర్మాణాత్మక కార్యక్రమాలు చేపట్టాలని విజ్ఞప్తి చేసారు.ఈ కార్యక్రమంలో పట్నం రాముడు, మునగాల చంద్రశేఖర్ రెడ్డి, రాఘవేంద్ర గౌడ్, మహమ్మద్ పర్వేజ్, జూపల్లి గోపాల్ రెడ్డి, కొమ్మా శ్రీహరి, భీమశంకర్ రెడ్డి, లక్ష్మీ నారాయణ, మనోజ్ కుమార్ రెడ్డి, రైతునగరం భాస్కర్ రెడ్డి, తూము శివారెడ్డి, షణ్ముకరావు, యమ్ వి .రమణారెడ్డి, నిట్టూరు సుధాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా విజయదుర్గా దేవి ఆలయ శరన్నవరాత్రి ఉడుపు రాట మహోత్సవం

**ఈ నెల 7 నుండి 15 వరకు ఉత్సవాలు**

**ఆలయ ధర్మకర్త బంగారు లక్ష్మీ**

మధురవాడ అక్టోబరు 1, (న్యూస్ పల్స్) అక్టోబర్ 1శ్రీశ్రీశ్రీ విజయదుర్గా దేవి ఆలయ శరన్నవరాత్రి ఉడుపు రాట మహోత్సవం శుక్రవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు బంగారు సుబ్బారావు, లక్ష్మీ దంపతుల ఆధ్వర్యంలో ఆలయ ప్రధానార్చకులు శ్రీకాంత్ శర్మ శాస్త్రోక్తంగా టైలర్స్ కాలనీ,విజయదుర్గా దేవి ఆలయ ప్రాంగణంలో పూజలు నిర్వహించారు..ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త బంగారు లక్ష్మీ మాట్లాడుతూ మధురవాడ పరిసర ప్రాంతాల ప్రజలు సుభిక్షంగా ఉండాలని గత 30 ఏళ్లుగా అమ్మవారి శరన్నవరాత్రి మహోత్సవములను అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నామని తెలిపారు.. ఈ ఏడాది కూడా ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయని అన్నారు..ఈ నెల 7వ తేదీ నుండి 15వ తేదీ వరకు ఉత్సవాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు..ఈ ఉత్సవాల్లో ప్రతీ రోజు అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు,సహస్ర కుంకుమార్చన , పంచామృత అభిషేకాలు,హోమాలతో పాటుగా కలశ యాత్ర, వసంతోత్సవం, అన్న సమారాధ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు..కావున భక్తులు ఉత్సవాల్లో పాల్గొని విజయదుర్గా దేవి ఆశీస్సులు పొందాలని ఆమె కోరారు..ఇందులో భాగంగా ఉడుపు రాట కార్యక్రమంలో వైఎస్సార్సీపీ 7వ వార్డు అధ్యక్షులు పోతిన శ్రీనివాసరావు,వైసీపీ సీనియర్ నాయకులు

వంకాయల మారుతీ ప్రసాద్,వనుపులేటి గోపి,బెల్లాన పాపారావు,రజిని,చిన్ని,ఆలయ నిర్వాహకులు బంగారు ప్రకాష్ తదితరులు పాల్గొని అమ్మవారి దర్శనం చేసుకున్నారు..ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ భక్తులు కోవిడ్ నిబంధనలు పాటిస్తూ ఉత్సవాల్లో పాల్గొనాలని సూచించారు.. అమ్మవారి కరుణా కాటాక్షాలతో రాష్ట్రాభివృద్ధి ఆటంకాలు లేకుండా ముందుకు సాగాలని జగన్మాతను ప్రార్దించినట్టు పేర్కొన్నారు..ఈ ఉడుపు రాటా మహోత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ,ప్రసాదాలు స్వీకరించారు..

## బద్వేల్ రెవిన్యూ డివిజన్ చేస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ

**ఇరవై ఏళ్ల తరువాత ఉప ఎన్నికలు**

కడప అక్టోబరు 1, (న్యూస్ పల్స్)బద్వేల్ నియోజకవర్గానికి వర్గానికి దాదాపు 20 సంవత్సరాల తర్వాత ఉప ఎన్నిక వచ్చింది. ఉప ఎన్నిక అక్టోబర్ 30 తేదీ జరగనుంది. ఉమ్మడి రాష్ట్రంలో రాష్ట్ర మంత్రిగా ఉన్న బద్వేల్ శాసనసభ్యుడు బిజినవేముల వీరారెడ్డి 2000 డిసెంబర్ 25 తేదీ అకస్మాత్తుగా మృతి చెందారు. దీంతో బద్వేల్ అసెంబ్లీ కి ఉప ఎన్నిక అనివార్యమైంది. గతంలో 2001 ఫిబ్రవరిలో ఉప ఎన్నికలు జరిగాయి. తెలుగుదేశం అభ్యర్థిగా దివంగత వీరారెడ్డి కూతురు విజయమ్మ, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా సీనియర్ నాయకులు డాక్టర్ శివరామకృష్ణ రావు పోటీ చేశారు. అప్పట్లో ఉప ఎన్నికలు ఎంతో ప్రతిష్టాత్మకంగా రసవత్తరంగా జరిగాయి. దివంగత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి దాదాపు రెండు వారాల పాటు బద్వేల్ లో మకాం వేసి కాంగ్రెస్ పార్టీ తరఫున ఉధృతంగా ప్రచారం చేశారు. అప్పట్లోనే ఉమ్మడి రాష్ట్రంలో లోని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, పలువురు ముఖ్య నాయకులు, పలువురు ముఖ్య నాయకులు, డాక్టర్ శివరామకృష్ణ తరపున ప్రచారం చేశారు. తెలుగుదేశం పార్టీ మద్దతుగా విజయమ్మ తరపున ఆ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు కీలక నేతలు ప్రచారం జరిపారు. అప్పట్లో ముఖ్యమంత్రిగా ఉన్న నారా చంద్రబాబు నాయుడు మాత్రం ఎన్నికల ప్రచారానికి రాలేదు.ఆ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి విజయమ్మ దాదాపు 19 వేలకు పైగా మెజార్టీతో ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఆ తర్వాత ఇప్పుడే బద్వేల్ కు ఉప ఎన్నికలు జరుగుతున్నాయి.

## జగన్ అండదండలు పుష్కలం

**బద్వేలు వైసీపీ అభ్యర్థి డాక్టర్ సుధా**



కడప అక్టోబరు 1, (న్యూస్ పల్స్)మడమ తిప్పని నేత రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అండదండలు తనకు పుష్కలంగా ఉన్నాయని బద్వేల్ వైసీపీ అభ్యర్థి డాక్టర్ సుధా స్పష్టం చేశారు అలాగే కడప ఎంపీ అవినాష్ రెడ్డి జిల్లాలోని వైసిపి ఎమ్మెల్యేలు బద్వేల్ మాజీ ఎమ్మెల్సీ గోవింద్ రెడ్డి స్థానిక వైసిపి నాయకులు కార్యకర్తలు తనకు అండగా నిలబడ్డారని ఆమె తెలిపారు. తన భర్త స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ డాక్టర్ వెంకట సుబ్బయ్య ఈ ఏడాది మార్చిలో అనారోగ్య కారణాలతో మృతిచెందడంతో తప్పనిసరి పరిస్థితుల్లో రాజకీయాల్లోకి రావడం జరిగిందన్నారు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తనకు తన కుటుంబానికి అండగా నిలబడ్డారని ఆమె చెప్పారు మాజీ ఎమ్మెల్సీ గోవిందరెడ్డి ముఖ్యమైన వైకాపా నాయకులు తన ను ప్రోత్సహించి అండగా ఉండడంతో బద్వేల్ అసెంబ్లీ స్థానానికి వైకాపా అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు డాక్టర్ సుధా తెలిపారు వైయస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని ఆమె తెలిపారు దేశమంతా మన రాష్ట్రం వైపు చూస్తుంది అంటే జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే కారణమన్నారు బద్వేలు వర్గంలో ఇప్పటికే అనేక అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఆమె తెలిపారు బద్వేల్ మున్సిపాలిటీ లో అభివృద్ధి పనులు చేసేందుకు పుష్కలంగా నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు అలాగే నియోజకవర్గంలో సాగునీటి ప్రాజెక్టుల విషయము లో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనబరిచిందని ఆమె తెలిపారు ఉప ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గుర్తు పై ఓట్లు వేసి గెలిపించాలని ఆమె కోరారు తన గెలిపిస్తే చేయవలసిన అభివృద్ధి పనులు గుర్తించి వాటిని పూర్తి చేస్తానని ఆమె తెలిపారు తనపై నమ్మకం ఉంచి ఓట్లు వేసి గెలిపించాలని డాక్టర్ సుధా కోరారు విలేకర్ల సమావేశంలో ఆడ చైర్మన్ సింగసాని గురు మోహన్ బద్వేల్ మున్సిపల్ చైర్మన్ వీ రాజగోపాల్ రెడ్డి సివిల్ సప్లై డైరెక్టర్ సుందర రామిరెడ్డి సగర సంఘం చైర్మన్ రమణమ్మ వైకాపా నాయకులు నోబుల్ శంకర్ రెడ్డి పుత్త శ్రీ రాములు తదితర వైకాపా నాయకులు పాల్గొన్నారు

## రెండు ఐషర్ వాహనాలు ఢీ?.డ్రైవర్లు సురక్షితం

అనంతపురం అక్టోబరు 1, (న్యూస్ పల్స్) అనంతపురం జిల్లా పుట్టపర్తి మండలం వీరాంజనేయ పల్లి వద్ద పెను ప్రమాదం తప్పింది.ముందు వెళ్తున్న ఐషర్ వాహనాన్ని వెనక వెళ్తున్న మరో ఐషర్ వాహనం ఢీకొనడంతో రెండు వాహనాలు దెబ్బతిన్నాయి. ఇద్దరు డ్రైవర్లు చాకచక్యంగా ప్రాణాలతో బయటపడ్డారు. నల్లమాడ వైపు నుంచి వరి పొట్టు లోడుతో పుట్టపర్తి వైపు వెళ్తున్న ఓ ఐషర్ వాహనం వెంగలమ్మ చెరువు మిట్ట వద్ద బ్రేక్ ఫెయిల్ కావడంతో ముందు వెళ్తున్న మరో ఐషర్ వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఓ ఐషర్ వాహనం వీరాంజనేయ పల్లి వద్ద చింత తోపు లోకి బోల్తా పడింది. మరో ఐషర్ వాహనం పెద్ద చింత చెట్టును ఢీకొంది. డ్రైవర్లు ఇద్దరూ ప్రాణాలతో బయట పడ్డారు.ఐషర్ వాహనం బోల్తా పడిన ప్రాంతంలో విద్యుత్ స్తంభాలు ఉన్నాయని వాటిని ఢీకొనక పోవడం వల్ల పెను ప్రమాదం తప్పిందని స్థానికులు చెబుతున్నారు.వీరాంజనేయ పల్లి వద్ద అధికారులు స్పందించి రహదారి సూచిక బోర్డులు, సైడ్ వాల్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

## 4వ తేదీ మండల కార్యవర్గ సమావేశం

**కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి**

విశాఖపట్నం జిల్లా డుంబ్రిగుడ మండల కేంద్రంలోకాంగ్రెస్ పార్టీ పూర్వ వైభవానికి మండల కార్యవర్గ సమావేశం కార్యకర్తలతో నిర్వహించడం జరిగింది ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా శ్రీమతి పాచిపెంట శాంతి కుమారి ప్రధాన కార్యదర్శి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ మరియు అరకు పార్లమెంటు డిస్టిక్ ఇంచార్జి గారు హాజరూ అవుతున్నారు కావున ఉదయం 9:గంటల 30 నిమిషాల కు కాంగ్రెస్ పార్టీ నాయకులు యూత్ కాంగ్రెస్ ఎన్ ఎస్ యు ఐ కిసాన్ సెల్ ఉమెన్ రైట్స్ ఐ ఎన్ టి యు సి అధ్యక్షులు సభ్యులు అనుబంధ సంస్థలు అభిమానులు సూచ తప్పకుండా అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరుతున్నాము ఈ కార్యక్రమానికి హాజరయ్యే ప్రతి ఒక్కరు మాస్కులు ధరించి రావాలి ఉపయోగించాలి సామాజిక దూరం పాటించాలని కోరారు

# అక్టోబరు 11న శ్రీవారికి ముఖ్యమంత్రి పట్టువస్త్రాల సమర్పణ



తిరుమల,,అక్టోబర్ 01,( విభారె) శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో అక్టోబరు 11న గరుడసేవ నాడు ముఖ్యమంత్రి గౌ. శ్రీ వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారని టిటిడి ఈవో డాక్టర్ కెఎస్.జవహర్‌రెడ్డి తెలిపారు. అదే రోజు ఎస్వీబీసీ కన్నడ, హిందీ ఛానళ్లతోపాటు పలు ప్రారంభోత్సవాలు చేస్తారని చెప్పారు. తిరుమల అన్నమయ్య భవనంలో శుక్రవారం డయల్ యువర్ ఈవో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఈవో వెల్లడించిన వివరాలు ఇవి.శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు :- శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలను అక్టోబరు 7 నుండి 15వ తేదీ వరకు 9 రోజుల పాటు ఆలయంలో ఏకాంతంగా నిర్వహించనున్నాం. అక్టోబరు 5న కోయిల్ ఆళ్వారు తిరుమంజనం, అక్టోబరు 6న అంకురార్పణ, అక్టోబరు 7న ధ్వజారోహణం, అక్టోబరు 11న గరుడవాహనం, అక్టోబరు 12న సాయంత్రం స్వర్ణరథం బదులుగా సర్వభూపాల వాహనం, అక్టోబరు 14న ఉదయం రథోత్సవానికి బదులుగా సర్వభూపాలవాహనం, అక్టోబరు 15 ఉదయం చక్రస్నానం (అయిన మహల్‌లో) – రాత్రి ధ్వజావరోహణం, అక్టోబరు 16న శ్రీవారి భాగ్‌సవారీ ఉత్సవం జరుగనున్నాయి.ముఖ్యమంత్రి చేతులమీదుగా ప్రారంభోత్సవాలు– అక్టోబరు 11న గరుడసేవ నాడు ముఖ్యమంత్రి గౌ. శ్రీ వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు. అదే రోజు పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రారంభించనున్నారు.– అలిపిరి పాదాల మండపం వద్ద చెన్నైకి చెందిన దాత శ్రీ శేఖర్‌రెడ్డి విరాళంతో నిర్మిస్తున్న గోమందిరాన్ని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఇందులో గోప్రదక్షిణ, గోతులాభారం, గోవు ప్రాశస్త్యాన్ని భక్తులకు తెలియజేసేలా ఏర్పాట్లు చేస్తున్నాం.– అలిపిరి నుంచి తిరుమల వరకు నడక దారి పైకప్పును రిలయన్స్ సంస్థ రూ.25 కోట్ల విరాళంతో పునఃనిర్మించిన మార్గాన్ని రాబోయే బ్రహ్మోత్సవాలలో భక్తులకు అందుబాటులోకి తీసుకువస్తాం.– తిరుమలలో ఇండియా సిమెంట్స్ రూ.12 కోట్ల విరాళంతో నిర్మించిన నూతన బూందిపోటును అందుబాటులోకి తీసుకువస్తాం.– ముఖ్యమంత్రి శ్రీ వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు చిన్నపిల్లల కోసం తిరుపతిలోని బర్డ్ ఆసుపత్రి పాత బ్లాక్‌లో పీడియాట్రిక్ కార్డియాక్ ఆసుపత్రి తాత్కాలిక భవన నిర్మాణపనులు పూర్తయ్యాయి. ఇందుకు సంబంధించి యంత్ర పరికరాలు ఇతర వసతులు దాదాపుగా పూర్తయ్యాయి. శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా అక్టోబరు

**ఎస్వీబీసీ కన్నడ, హిందీ ఛానళ్లతోపాటు పలు ప్రారంభోత్సవాలు**
**డిసెంబరులో అందుబాటులోకి ఆయుర్వేద గృహోవసరాల ఉత్పత్తులు**
**జాతీయ స్థాయిలో తిరుమల మ్యూజియం అభివృద్ధి పనులు**
**డయల్ యువర్ ఈవోలో టిటిడి ఈవో డాక్టర్ కెఎస్.జవహర్‌రెడ్డి**

11వ తేదీన ముఖ్యమంత్రి చేతులమీదుగా ఈ ఆసుపత్రిని ప్రారంభించేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం.బర్డ్– బర్డ్ ఆసుపత్రికి దాతలు కోట్లాది రూపాయల విలువైన పరికరాలు విరాళంగా అందించారు. అదేవిధంగా దేశవ్యాప్తంగా ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్లు, ఆర్థోపెడిక్ డాక్టర్లు స్వచ్ఛందంగా విజిటింగ్ కన్సల్టెంట్లుగా ఓపిలు, అరుదైన ఆపరేషన్లు నిర్వహిస్తున్నారు. వీరందరికీ కృతజ్ఞతలు.– టిటిడి ముద్రించిన 2022 – డైరీలు, క్యాలెండర్లను బ్రహ్మోత్సవాలలో తిరుమల, తిరుపతిలలోని అన్ని టిటిడి ప్రచురణల విక్రయశాలల్లో భక్తులకు అందుబాటులో ఉంచుతాం.సర్వదర్శనం టోకెన్లు– భక్తుల ఆరోగ్య భద్రత దృష్ట్యా సెప్టెంబరు 25వ తేదీ నుండి ఆన్లైన్లో సర్వదర్శనం టోకెన్ల విడుదల చేశాం.– శ్రీవారి దర్శనం కోసం వచ్చే భక్తులు వ్యాక్సిన్ వేయించుకున్న సర్టిఫికెట్ కానీ, దర్శనం సమయానికి మూడు రోజుల ముందు ఆర్‌టిపిసిఆర్ కరోనా పరీక్ష చేయించుకుని నెగిటివ్ సర్టిఫికెట్ గానీ తప్పనిసరిగా తీసుకురావాలని భక్తులకు విజ్ఞప్తి చేస్తున్నాను.– శ్రీవారి సప్తగిరులకు సూచికగా ఏడు బ్రాండ్లతో సెప్టెంబరు 13న అగరబత్తులను భక్తులకు అందుబాటులోకి తీసుకువచ్చాం. వీటికి భక్తుల నుండి విశేష స్పందన లభిస్తోంది. డిమాండ్‌కు తగినంత ఉత్పత్తి పెంచాల్సిన అవసరముంది.డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయంతో ఎంఓయు– వివిధ ఆలయాల్లో ఉపయోగించిన పూలతో స్వామి, అమ్మవార్ల ఫోటోలు, క్యాలెండర్లు, డ్రైఫ్లవర్ మాలలు, తదితరాలు తయారు చేయడానికి డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయంతో ఎంఓయు కుదుర్చుకున్నాం. రాబోవు రెండు, మూడు నెలలో భక్తులకు అందుబాటులోకి తెస్తాం.గుడికో గోమాత– హిందూ ధర్మాన్ని విస్తృత ప్రచారం చేయడంలో భాగంగా దేశవ్యాప్తంగా గుడికో గోమాత కార్యక్రమం ప్రారంభించాం. దేశంలో భక్తులు ఏ ఆలయానికి వెళ్లినా గోపూజ చేసుకునే ఏర్పాటు చేయడానికి టిటిడి సిద్ధంగా ఉంది. ఇందులో భాగంగా తిరుపతిలోని శ్రీ కపిలేశ్వరాలయంలో ఇటీవల గోపూజను ప్రారంభించాం. త్వరలో తిరుపతిలోని అన్ని ఆలయాల్లో గోపూజ సేవ అందుబాటులోకి వస్తుంది.గో ఆధారిత ఉత్పత్తులతో శ్రీవారికి నైవేద్యం– శ్రీవారికి గో ఆధారిత ప్రకృతి వ్యవసాయంతో పండించిన బియ్యం, కూరగాయలు, బెల్లం, పప్పుదినుసులతో తయారు చేసిన అన్నప్రసాదాలను ఈ ఏడాది మే 1వ తేదీ నుండి నిత్య నైవేద్యంగా సమర్పిస్తున్నాం. ఈ కార్యక్రమం నిరంతరాయంగా కొనసాగేందుకు పలువురు దాతలు ముందుకొస్తున్నారు. ఈ ఆలోచన నుంచే నవనీత సేవ కార్యక్రమం పుట్టింది.నవనీత సేవ– దేశీయ గోవుల పాలతో తయారుచేసిన పెరుగును చిలికి వెన్న తయారుచేసి, తిరుమల శ్రీవారికి సమర్పించేందుకు ఆగస్టు 30న కృష్ణాష్టమి పర్వదినం నుంచి నవనీత సేవను ప్రారంభించాం. భక్తులు ఈ సేవలో పాల్గొనడానికి అవకాశం కల్పిస్తున్నాం. ఇందుకోసం భక్తుడు తిరుమల గోశాలకు రాజస్థాన్ నుండి గిర్ గోవులను తెప్పించి విరాళంగా ఇచ్చారు. గోసంరక్షణ– టిటిడి ఆధ్వర్యంలోని తిరుమల, తిరుపతి, పలమనేరు గోశాలలను అభివృద్ధి చేయాలని నిర్ణయించాం.

# సంక్షేమ వసతి గృహాల పిల్లలను మంచి ప్రయోజకులుగా తయారు చేయండి

**జిల్లా కలెక్టర్ పి కోటేశ్వరరావు**



కర్నూలు, అక్టోబర్ 01( విభారె) :-సంక్షేమ వసతి గృహాల పిల్లలను మంచి ప్రయోజకులుగా తయారు చేయాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ ల అధికారులను జిల్లా కలెక్టర్ పి కోటేశ్వర రావు ఆదేశించారు.శుక్రవారం కర్నూలు కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్ హాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ లకు చెందిన జిల్లా అధికారులు, ఏయస్ డబ్ల్యూఓ, ఏబిసిడబ్ల్యుఓ, ఏటిడబ్ల్యూఓలతో జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వర రావు సమీక్ష నిర్వహించారు.సోషల్ వెల్ఫేర్ డిడి ప్రతాప్ సూర్యనారాయణ రెడ్డి, జిల్లా బి.సి.సంక్షేమ అధికారి వెంకటలక్ష్మి, డి ఎస్ డబ్ల్యూఓ చింతామణి, జిల్లా మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ మహబూబ్ బాషా, డిటిడబ్ల్యూఓ రమ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ లకు చెందిన అధికారులు, తదితరులు పాల్గొన్నారు.జిల్లా కలెక్టర్ పి కోటేశ్వర రావు మాట్లాడుతూ. సంక్షేమ వసతి గృహాల్లో చదివే పిల్లలు పేద పిల్లలని వారిపట్ల ప్రేమ, అనురాగం, ఆప్యాయత చూపిస్తూ మన పిల్లల లాగే బాగా చూసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. సంక్షేమ వసతి గృహాలలో మంచి వసతులతో పాటు ప్రభుత్వం నిర్దేశించిన భోజనం మెనూను తప్పక పాటిస్తూ ఎటువంటి లోటు లేకుండా చూసుకోవాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. సమాజానికి పనికి వచ్చే విధంగా ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి అన్నారు. ఉదయం, సాయంత్రం సమయంలో విద్యార్థులు భోజనం చేసే సమయంలో వారిని ఆప్యాయతతో పలకరిస్తూ మంచి విలువలు నేర్పాలన్నారు. తన ఇంటి కన్నా హాస్టల్ బాగా ఉంది అనిపించేలా ఆ వాతావరణాన్ని పిల్లలకు కల్పించాలన్నారు. ఈ అవకాశం ఎవరికీ రాలేదని, అది మీకు మాత్రమే వచ్చిందని, దేశం గర్వించదగ్గ విధంగా పిల్లలను ప్రయోజకులుగా తయారు చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ పరిధిలోని సంక్షేమ వసతి గృహాలలో ఎంత మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు.వంటి వివరాలను సోషల్ వెల్ఫేర్ డిడి జిల్లా కలెక్టర్ కు వివరించారు.


# యస్ సి, యస్ టి అట్రాసిటీ చట్టాన్ని నీరు కార్చొద్దు



**ఈ నెల 09 వ తేదీ జరుగబోయే సభను జయప్రదం చేయండి**
**నవ్యాంధ్ర యం అర్ పి యస్, బహుజన ఐక్య వేదిక పిలుపు**

మంత్రాలయం అక్టోబర్ 01( విభారె) :ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని నీరుకార్చే దని నవ్యాంధ్ర యం అర్ పి యస్ ఆదోని డివిజన్ అధ్యక్షుడు రామతీర్థం. అమ్రేష్ పేర్కొన్నారు. ఆయన ఆధ్వర్యంలో ఎమ్మిగనూరు స్థానిక పెద్ద పార్కు అవరణం నందు పత్రికా సమావేశంలో ప్రసంగించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న నవ్యాంధ్ర యం అర్ పి యస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అలిగిరి. రవి మాదిగ, బహుజన ఐక్య వేదిక ఫౌండర్ కిరణ్,నవ్యాంధ్ర యం అర్ పి యస్ జిల్లా ఇంచార్జి జానయ్య, అధికార ప్రతినిధి జయన్న లు మాట్లాడుతూ ఈ నెల 09 వ తేదీ కర్నూలులో జరుగబోయే అట్రాసిటి చట్టాన్ని నీరు కార్చొద్దు సభను జయప్రదం చేయాలని కోరారు.ఈ కారిక్రమానికి ఆదోని డివిజన్ యస్ సి ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని యస్ యస్ టి అట్రాసిటీ చట్టం-1989 అవగాహన పెంచుకొని అందరూ చట్టంపై అవగాహన ఏర్పరుచుకోవాలి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధి మరియు ప్రసంగీకులు జడ్జి. రామకృష్ణ గారు వస్థారని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఆదోని డివిజన్ ప్రధాన కార్యదర్శి జడ. రవి నవ్యాంధ్ర యం అర్ పి యస్ ఎమ్మిగనూరు నియోజక వర్గ అధ్యక్షుడు నగేష్, మారెప్ప మంత్రాలయం అధ్యక్షుడు హనుమన్న, రత్నం, దేవపుత్ర తదితరులు పాల్గొన్నారు.

# 'కొండ పొలం' మీద ఫోకస్ చేయడం లేదేంటి.?




క్రిష్ జాగర్లమూడి దర్శకత్వంలో మెగా హీరో పంజా వైష్ణవ్ తేజ్ – స్టార్ హీరోయిన్ రకుల్ ప్రీత్ సింగ్ జంటగా నటించిన చిత్రం "కొండ పొలం". మెగా మేనల్లుడికి ఫస్ట్ సినిమా 'ఉప్పెన' ప్రేక్షకుల ముందుకు రాకముందే ఈ చిత్రాన్ని సెట్స్ మీదకు తీసుకెళ్లారు. తక్కువ సమయంలో క్వాలిటీ అవుట్ పుట్ అందించే క్రియేటివ్ డైరెక్టర్ క్రిష్.. కేవలం 45 రోజుల్లోనే ఈ చిత్రాన్ని పూర్తి చేశారు. 'ఉప్పెన' సినిమా సూపర్ హిట్ అవ్వడంతో.. అదే ఊపులో వీలైనంత త్వరగా వైష్ణవ్ రెండో చిత్రాన్ని కూడా రిలీజ్ చేయాలని మేకర్స్ భావించారు. అయితే కరోనా సెకండ్ వేవ్ ప్రభావం వల్ల ఏర్పడిన పరిస్థితుల్లో కుదరలేదు.ఈ నేపథ్యంలో "కొండ పొలం" చిత్రాన్ని డైరెక్ట్ ఓటీటీ విధానంలో రిలీజ్ చేసే అవకాశం ఉందని వార్తలు వచ్చాయి కానీ.. మేకర్స్ మాత్రం థియేట్రికల్ రిలీజ్ కోసమే వేచి చూశారు. ఇప్పుడు పరిస్థితులు మెరుగ్గా ఉండటంతో ఎట్టకేలకు ఈ చిత్రాన్ని థియేటర్లలోకి తీసుకురావడానికి రెడీ అయ్యారు. అక్టోబర్ 8న ఈ మూవీని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. అయితే మరో వారంలో ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రం మీద పెద్దగా ఎవరూ ఫోకస్ చేయడం లేదనే కామెంట్స్ వినిపిస్తున్నాయి.గత నెలలో 'కొండ పొలం' టైటిల్ ను ప్రకటించి సినిమా పబ్లిసిటీ మొదలు పెట్టారు మేకర్స్. ఈ క్రమంలో ఫస్ట్ లుక్ తో పాటుగా ఓ పాటను కూడా వదిలారు. ఇటీవలే థియేట్రికల్ ట్రైలర్ ను రిలీజ్ చేశారు. అయితే ఎందుకనో ప్రమోషనల్ కంటెంట్ పెద్దగా ఆదరణ దక్కించుకోకపోగా.. సినిమాపై ఆశించిన స్థాయిలో బజ్ క్రియేట్ చేయలేకపోయిందనే కామెంట్స్ వస్తున్నాయి. కాకపోతే 'ఉప్పెన' తరువాత మెగా మేనల్లుడి నుంచి వస్తున్న మూవీ కావడంతో ఈ సినిమాకు ప్రీ రిలీజ్ బిజినెస్ మాత్రం బాగానే అవుతుందని ట్రేడ్ వర్గాలు చెబుతున్నారు. మరి రాబోయే రోజుల్లో అగ్రెసివ్ గా ప్రమోషన్స్ చేసి సినిమాని జనాల్లోకి తీసుకెళ్తారేమో చూడాలి.కాగా సన్నపురెడ్డి వెంకట రామిరెడ్డి రాసిన 'కొండ పొలం' నవల ఆధారంగా ఈ సినిమా రూపొందుతోంది. అటవీ నేపథ్యంలో సాగే ఈ గ్రామీణ అడ్వెంచర్ మూవీలో పంజా వైష్ణవ్ తేజ్ – రకుల్ ప్రీత్ సింగ్ గొర్రెల కాపరులుగా కనిపించనున్నారు. బిబో శ్రీనివాస్ సమర్పిస్తున్న ఈ చిత్రాన్ని సాయిబాబు జాగర్లమూడి – రాజీవ్ రెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇది ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై వస్తోన్న 8వ చిత్రం. కీరవాణి ఈ చిత్రానికి సంగీతం సమకూర్చగా.. జ్ఞాన శేఖర్ వీఎస్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. రాజ్ కుమార్ గిబ్సన్ ఆర్ట్ డైరెక్టర్. శ్రవణ్ కటికనేని ఎడిటింగ్ చేశారు.

# లవ్ స్టోరి తర్వాత బ్యాచిలర్ నిరూపిస్తాడా!




అక్కినేని వారసుడు అఖిల్ కథానాయకుడిగా బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వంలో తెరకెక్కిన 'మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్' రిలీజ్ ఇప్పటికే చాలాసార్లు వాయిదా పడిన సంగతి తెలిసిందే. చిత్రీకరణ ప్రారంభమైన దగ్గర నుంచి సినిమా పనులన్ని నెమ్మదిగానే సాగాయి. అటుపై కరోనా రాకతో మరింత ఆలస్యమైంది. రిలీజ్ కి కరోనా బాగా అడ్డంకిగా మారింది. ఈ నేపథ్యంలో ఏడాదిగా రిలీజ్ తేదీలు ప్రకటించం.. వాయిదా వేసుకోవడం జరిగింది. ఇక చివరిగా దసరా కానుకగా రిలీజ్ చేయాలని మేకర్స్ నిర్ణయించారు. ఈ నేపథ్యంలో అక్టోబర్ 15న భారీ ఎత్తున థియేటర్లో రిలీజ్ కి రెడీ అవుతోంది. అయితే ఈ తేదీ అఖిల్ కలిసొచ్చే అంశంగా చెప్పొచ్చు. సాధారణంగా దసరాకి చాలా సినిమాలు రిలీజ్ అవుతుంటాయి.కానీ ఈసారి ఆ పరిస్థితి లేదు. కరోనా కారణంగా షూటింగ్ అనుకున్న టైమ్ లో పూర్తి కాకపోవడంతో చాలా సినిమాలు షూటింగ్ లు పెండింగ్ ఉండిపోవడం..మరికొన్ని చిత్రాలు పోస్ట్ ప్రొడక్షన్ పనులు డిలే కావడం వంటివి జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ దసరాకి బ్యాచిలర్ తప్ప మరో సినిమా బాక్సాఫీస్ బరిలో నిలవడం లేదని సమాచారం. బాలకృష్ణ నటిస్తోన్న 'అఖండ' చిత్రాన్ని దసరాకి రిలీజ్ చేయాలని భావించారు. కానీ సాధ్యపడలేదు. అలాగే 'ఆచార్య' సహా కొన్ని పెద్ద సినిమాలు..చిన్న చిత్రాలు కూడా డిలే కారణంగా వాయిదా వేసుకోవాల్సి వచ్చింది. ఇవన్నీ అఖిల్ కి కలిసొచ్చే అంశాలు.ఇప్పటివరకూ అఖిల్ కెరీర్లో సరైన సక్సెస్ లేదు. యావరేజ్ అనుకున్న సినిమాలకు అదే సమయంలో ఇతర రిలీజ్ ల ఇంపాక్ట్ పడింది. ఈసారి ఆ పరిస్థితి లేదు. సినిమా హిట్ టాక్ తెచ్చుకున్నా.. డివైడ్ టాక్ తెచ్చుకున్నా 'లవ్ స్టోరి' లా బండి లాగించేయడానికి ఆస్కారం ఉంది. బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వం వహించిన చిత్రం కావడంతో బ్యాచిలర్ పైనా భారీ అంచనాలు ఉన్నాయి. మరి అఖిల్ టైమ్ ఎలా ఉంది అన్నది వేచి చూడాలి. ఏదేమైనా అఖిల్ కంటెంట్ తో సత్తా చాటాల్సి ఉంటుంది.'మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్' టాలీవుడ్ అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాలలో ఒకటి. ఈ సినిమా ప్రోమోలు– పోస్టర్లు– టీజర్ ప్రేక్షకులలో గొప్ప ఆసక్తి ఉత్సుకతని రేకెత్తించాయి. ఇంతకుముందు రిలీజ్ తేదీని ప్రకటిస్తూ మేకర్స్ పోస్టర్ ను షేర్ చేసారు. మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్ చిత్రాన్ని 15 అక్టోబర్ 2021 న థియేటర్లలో విడుదల చేస్తామని ఇటీవల ప్రకటించారు. ఈ దసరాకి కుటుంబ సమేతంగా థియేటర్లకు వచ్చి ఆనందించదగిన చిత్రమిదని చిత్రబృందం ప్రకటించింది.

# ధనుష్ - కమ్ముల మూవీ.. ఫ్లేవర్ విషయంలో క్లాష్

టాలీవుడ్ ట్యాలెంటెడ్ డైరెక్టర్ శేఖర్ కమ్ముల దర్శకత్వంలో ఒక సినిమాను చేసేందుకు కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన విషయం తెల్సిందే. భారీ అంచనాల నడుమ ఈ సినిమా పట్టాలెక్కబోతుంది. తమిళం మరియు తెలుగు లో ఏక కాలంలో ఈ సినిమాను రూపొందిస్తున్నారు. తెలుగు లో డైరెక్ట్ సినిమా చేయడం ద్వారా తెలుగు ప్రేక్షకులకు మరింత చేరువ అయ్యే అవకాశాలు ఉన్నాయనే ఉద్దేశ్యంతో శేఖర్ కమ్ముల దర్శకత్వంలో ధనుష్ నటించేందుకు ఓకే చెప్పాడు. వీరిద్దరి



కాంబో మూవీ కోసం తెలుగు ప్రేక్షకులు చాలా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ధనుష్ ప్రస్తుతం చేస్తున్న సినిమాలు ముగించిన తర్వాత శేఖర్ కమ్ముల దర్శకత్వంలో సినిమాను చేసేందుకు గాను ఏర్పాట్లు చేస్తున్నట్లుగా సమాచారం అందుతోంది. ప్రస్తుతం స్క్రిప్ట్ విషయంలో చర్చలు జరుగుతున్నాయి. ధనుష్ సినిమా అంటే తమిళ ఆడియన్స్ లో విపరీతమైన క్రేజ్ ఉంటుంది.ఆయన నటించే ప్రతి సినిమాలో కూడా తమిళ ఫ్లేవర్ ఎక్కువగా కనిపిస్తూ ఉండేది. ఆయన కట్టుబొట్టు మరియు ఆయన స్టైల్ అన్ని కూడా తమిళులను రిప్రజెంట్ చేసే విధంగా ఉంటాయి. అలానే ప్రేక్షకులు ధనుష్ ను ఊహించుకుంటారు. అలాంటి ధనుష్ ను పూర్తి విభిన్నంగా శేఖర్ కమ్ముల చూపించే ప్రయత్నం చేస్తే తమిళ ఆడియన్స్ ఎలా రియాక్ట్ అవుతారు అనేది ప్రశ్న. గత కొన్ని రోజులుగా ఇదే విషయమై శేఖర్ కమ్ముల మరియు ధనుష్ ల మద్య జరుగుతున్నట్లుగా సమాచారం అందుతోంది. ఫ్లేవర్ విషయంలో కాస్త తమిళ టచ్ ఇచ్చేలా స్క్రిప్ట్ మరియు స్క్రీన్ ప్లేను చేంజ్ చేయాలంటూ ధనుష్ కోరుతున్నాడని.. అందుకు శేఖర్ కమ్ముల నో చెప్పలేక ఓకే చెప్పలేక మదనపడుతున్నట్లుగా గుసగుసలు వినిపిస్తున్నాయి. వీరిద్దరి కాంబో మూవీ తెలుగు లో రూపొందుతున్న కారణంగా తెలుగు నేటివిటీకి తగ్గట్లుగా సన్నివేశాలను కమ్ముల రాసుకున్నాడు. కాని తన తమిళ ఆడియన్స్ కోసం అంటూ ధనుష్ మార్పులు కోరుతున్నాడు.వీరిద్దరి మద్య ఉన్నది చిన్న క్లాష్ అవ్వడం వల్ల అది అతి త్వరలోనే సర్దుకుంటుందని.. మరికొన్ని రోజుల్లోనే సినిమాను పట్టాలెక్కించే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. లవ్ స్టోరీ సినిమా లో సమాజంలో ఉన్న సమయ్యలు మరియు కులం మతం అంతరాల గురించి చూపించడం జరిగింది. ఇలాంటి నేపథ్యంలో ధనుష్ గతంలోనే సినిమాలు చేయడం జరిగింది. ఎక్కువ కులం తక్కువ కులం అనే తారతమ్యాలు ఉండే కథతోనే కమ్ముల కొత్త సినిమా ఉంటుందని.. ధనుష్ మరోసారి అలాంటి పాత్రలో నటించేందుకు సిద్దం అయ్యాడు అంటూ వార్తలు వచ్చాయి. కాని తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం శేఖర్ కమ్ముల దర్శకత్వంలో ధనుష్ హీరోగా రూపొందబోతున్న సినిమా కథ కులాలకు సంబంధం లేకుండా సాగుతుందని అంటున్నారు. కథ విషయంలో ఇంకా క్లారిటీ ఇవ్వక పోవడంతో పాటు షూటింగ్ ను ఎప్పుడు మొదలు పెట్టేది.. సినిమా విడుదల ఎప్పుడు అనే విషయాలను మేకర్స్ క్లారిటీ ఇవ్వలేదు. వచ్చే ఏడాదిలో ఈ క్రేజీ కాంబో మూవీ విడుదల అవ్వాలని ప్రేక్షకులతో పాటు ఇండస్ట్రీ వర్గాల వారు కూడా ఆశిస్తున్నారు. తెలుగు ఆడియన్స్ ధనుష్ ను ఈసారైనా ఆధరిస్తారా అనేది చూడాలి. కోలీవుడ్ కు చెందిన ఇతర చిన్న హీరోలు టాలీవుడ్ లో మంచి ప్రభావం చూపించారు కాని ధనుష్ మాత్రం ఒకటి రెండు సినిమాలు తప్ప తెలుగు లో ఆకట్టుకున్న దాఖలాలు లేవు. అందుకే డైరెక్ట్ సినిమా తో ధనుష్ ఎటాక్ కు సిద్దం అయ్యాడు.

# వాళ్లిద్దరూ కోచ్, మెంటార్లుగా ఉంటే.. టీమిండియాకు వరం!

టీ20 ప్రపంచకప్-2021 టోర్నీ ముగిసిన తర్వాత టీమిండియా హెడ్‌కోచ్ పదవి నుంచి రవిశాస్త్రి తప్పుకోనున్నాడన్న వార్తల నేపథ్యంలో... కొత్త కోచ్ ఎవరన్న అంశంపై జోరుగా చర్చ నడుస్తోంది. అనిల్ కుంబ్లే, వీవీఎస్ లక్ష్మణ్, వీరేంద్ర సెహ్వాగ్, రాహుల్ ద్రవిడ్‌ల పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. మరోవైపు.. కుంబ్లే పేరును బీసీసీఐ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ ప్రతిపాదించినప్పటికీ.. తనకు ఈ పదవిపై ఆసక్తి లేదని కుంబ్లే చెప్పినట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో.. బీసీసీఐ విదేశీ కోచ్‌ను సంప్రదించే పనిలో ఉన్నట్లు కథనాలు




వెలువడుతున్నాయి.ఈ నేపథ్యంలో టీమిండియా మాజీ చీఫ్ సెలక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. భారత జట్టు మాజీ సారథి రాహుల్ ద్రవిడ్ హెడ్‌కోచ్ అయితే బాగుంటుందని పేర్కొన్నాడు. స్పోర్ట్స్‌తక్‌తో అతడు మాట్లాడుతూ.. "ద్రవిడ్ కోచ్‌గా ఉండాలని నేను మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా. రవి భాయ్ యుగం ముగిసిన తర్వాత.. ఎంఎస్ ధోని మెంటార్‌గా, ద్రవిడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టనున్నారని నా సహచర కామెంటేటర్లతో ఛాలెంజ్ చేశా. ఐపీఎల్ కామెంట్రీ చేస్తున్న సమయంలో ఈ విషయాలు చర్చకు వచ్చాయి. కోచ్‌గా ద్రవిడ్, మెంటార్‌గా ధోని ఉంటే భారత క్రికెట్‌కు అదొక వరంలా మారుతుంది. ఇద్దరూ కూల్‌గా ఉంటారు. అందులో ఒకరు(ద్రవిడ్) మరీ హార్డ్ వర్కర్. ఇండియా ఏ జట్టులో చాలా మంది ఇప్పటికే ఆయన శిక్షణలో రాటుదేలుతున్నారు. నేను అనుకున్నట్లుగా ధోని మెంటార్, ద్రవిడ్ కోచ్ కాకపోతే నేను నిరాశచెందుతాను" అని చెప్పుకొచ్చాడు. 2017లో భారత జట్టు హెడ్ కోచ్‌గా నియమితుడైన రవిశాస్త్రి హయాంలో టీమిండియా చెప్పుకోదగ్గ స్థాయిలో రాణించిన సంగతి తెలిసిందే. అయితే, ఇంతవరకు ఐసీసీ ట్రోఫీ మాత్రం గెలవలేదు.

## కోహ్లిని దాటాడు; రోహిత్‌తో సమానంగా నిలిచాడు

పాకిస్తాన్ కెప్టెన్ బాబర్ అజమ్ ప్రస్తుతం తన కెరీర్‌లో అత్యున్నత ఫామ్‌ను కనబరుస్తున్నాడు. సెంచరీలను మంచినీళ్ల ప్రాయంగా అందుకున్న బాబర్ అజమ్ తాజాగా టి20ల్లో కొత్త రికార్డు సాధించి చరిత్ర సృష్టించాడు. టి20ల్లో సెంచరీలు చేయడం చాలా అరుదుగా కనిపిస్తుంది. నేషనల్ టి20కప్‌లో భాగంగా సెంట్రల్ పంజాబ్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న బాబర్ అజమ్ నార్తన్‌తో జరిగిన మ్యాచ్‌లో సెంచరీ సాధించాడు. 63 బంతులెదుర్కొన్న అజమ్ 105 పరుగులు సాధించాడు. ఇందులో 11 ఫోర్లు.. 3 సిక్సులు ఉన్నాయి. అయితే బాబర్ అజమ్ మెరుపు ఇన్నింగ్స్ జట్టును గెలిపించలేకపోయినప్పటికీ కొన్ని రికార్డులు మాత్రం బద్దలు కొట్టాడు.తాజా సెంచరీతో టి20ల్లో అన్ని మ్యాచ్‌లు కలిపి బాబర్ అజమ్ 6 సెంచరీలు సాధించాడు. 193 మ్యాచ్‌ల్లోనే అజమ్ ఈ ఫీట్‌ను అందుకున్నాడు. కాగా రోహిత్ శర్మ టి20ల్లో 353 మ్యాచ్‌లాడి 6 సెంచరీలు సాధించాడు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**